దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

నందన్ ఎలక్ట్రానిక్స్
సెల్ నెం. 9949010118
డీలర్స్ ఇన్ : సెక్యూరిటీ సిస్టం, సీసీ కామెరాస్, బయోమెట్రిక్ అండ్ ఫైర్ సేఫ్టీ
UNICAM SYSTEMS
CP PLUS enhancing vision
Panasonic HIKVISION
Opp. Water Tank, Durga Nagar Junction, Mailrdevpally, Hyderabad-05

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 222 | ది. 9-11-2025 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 222 | Date : 9-11-2025 | Sunday | Pages : 8 | Rs.1/- |

## అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్దే లక్ష్యం

- పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి సహకారం
- కుప్పం నియోజకవర్గంలో 7 పరిశ్రమలకు సీఎం చేతుల మీదుగా వర్చువల్ గా శంకుస్థాపన
- రూ.2,203 కోట్లతో కుప్పంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు, 22,330 మందికి ఉద్యోగాలు
- త్వరలో రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు రానున్నట్టు వెల్లడించిన సీఎం చంద్రబాబు




**అమరావతి,నవంబర్ 8 (వార్తాప్రభ) :** అన్ని రంగాల్లోనూ రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు , పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు వివరించారు. అలాగే చిత్తూరు జిల్లాలో వెనుకబడిన కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పంలో 7 పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. హిందాల్కో, శ్రీజా డైరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్వీఎఫ్ సోయా, మదర్ డైరీ, ఇ-రాయస్ ఈవీ, అలీప్ పరిశ్రమలు కుప్పంలో రూ. 2,203 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. తద్వారా 22,330 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఈ ఏడు సంస్థలకు 241 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. పరిశ్రమల శంకుస్థాపన సందర్భంగా స్థానిక ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులతో ఆన్ లైన్ ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామని, తన అధ్యక్షతన జరుగుతున్న రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన ఆమోదం ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. త్వరలో కుప్పం నియోజకవర్గానికి రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు రాబోతున్నాయని, వీటి రాకతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 43 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాయలసీమ జిల్లాల్లో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నట్టు సీఎం చెప్పారు. స్థానికంగా ఉన్న యువతకు స్కిల్ డెవలప్మెంట్ కల్పించేలా హిందాల్కో సంస్థ యూనిట్ ను ఏర్పాటు చేయనుందని సీఎం తెలిపారు. రూ.586 కోట్లతో శిక్షణా టెక్నికల్ శిక్షణా కేంద్రాన్ని హిందాల్కో నెలకొల్పనుంది. రూ. 290 కోట్ల వ్యయంతో సమీకృత డెయిరీ, పశుమేత ప్లాంట్ ను శ్రీజా డెయిరీ సంస్థ ఏర్పాటు చేయనుందని.. తద్వారా స్థానిక మహిళలకు, పాడి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. డెయిరీ ప్రోటీన్ తయారీ కోసం ఏస్ ఇంటర్నేషనల్ రూ.525 కోట్ల పెట్టుబడిని పెట్టనుందని వెల్లడించారు. ఇక స్థానికంగా 2 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించేలా ఎస్వీఎఫ్ సోయా సంస్థ రూ.373 కోట్ల వ్యయంతో ప్లాంట్ ను ఏర్పాటు చేయనుంది. పండ్లు ఉత్పత్తి చేస్తున్న రైతులకు ప్రయోజనం కల్పించేందుకు మదర్ డైరీ సంస్థ రూ.260 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. జ్యూస్, జామ్, పల్ప్ యూనిట్ ను మదర్ డైరీ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. ఎలక్ట్రిక్ ఆటోలు, ద్విచక్ర వాహనాలు తయారీ సంస్థ ఇ-రాయస్ ఈవీ అడ్వాన్స్ ఎలక్ట్రిక్ వెహికల్ ప్లాంట్ ను కూడా ఏర్పాటు చేస్తోందని రూ.200 కోట్లతో ప్లాంట్ ప్రారంభం కానుందని తెలిపారు. గ్రీన్ మొబిలిటికి కేంద్రంగా కుప్పం మారుతుందని అన్నారు. స్వయం సహాయ సంఘాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలకు ఉపకరించేలా రూ.27 కోట్ల తో పారిశ్రామిక పార్కును అలీప్ సంస్థ ఏర్పాటు చేయనుందన్నారు. 40 వేల చదరపు అడగుల విస్తీర్ణంలో నిర్మించే ఈ మహిళా శక్తి భవన్ లో 4 వేల మంది మహిళలకు ఉపాధి, శిక్షణ అవకాశాలు కలుగుతాయని అన్నారు.

**మంచి పబ్లిక్ పాలసీలు చరిత్రను తిరగరాస్తాయి..** కుప్పం నియోజకవర్గానికి చెందిన ప్రజలతో సీఎం మాట్లాడుతూ "ప్రతి మహిళ, ప్రతి యువత ఒక పారిశ్రామికవేత్త కావాలి. పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చారన్నది ముఖ్యం కాదు. ఉన్నత విద్య ద్వారానే ప్రయోజకత్వం వస్తుంది. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వన్ ఫ్యామిలి -వన్ ఎంటర్ ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ నిపుణులు అనే పాలసీలు చరిత్రను తిరగరాస్తాయి. ప్రతి పరిశ్రమా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలి. 100 శాతం సౌర విద్యుత్ వినియోగించుకునే నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తున్నాం. తమిళనాడు, కర్ణాటకలకు అనుసంధానంగా ఉన్న కుప్పానికి అభివృద్ధి అవకాశాలు ఉన్నాయి. కుప్పం నుంచి వివిధ ప్రాంతాలను అనుసంధానం చేసేలా రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. ఎయిర్ కనెక్టివిటీ పెంచుతాం.

## ఏపీలో 32 జిల్లాలు?

### ఏ జిల్లాలోకి ఏయే నియోజకవర్గాలు




**అమరావతి,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ లోనూ తెలంగాణతో సమానంగా జిల్లాలను ఏర్పాటు చేస్తారా లేక తగ్గిస్తారా అన్నది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉంది. ఇటీవల సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు చురుగ్గా పరిశీలిస్తున్నారు. తెలంగాణలో 33 జిల్లాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లోనూ 33 జిల్లాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ మంత్రివర్గ ఉప సంఘం మాత్రం 32 జిల్లాలను సిఫార్సు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో 26 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రం విడిపోయిన 2014 నాటికి ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాలతో ఏర్పాటైంది. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక 2022లో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరిగింది. ప్రతి లోక్ సభ నియోజకవర్గాన్నీ ఓ జిల్లాగా మార్చాలనే ప్రతిపాదనతో మొదలుపెట్టి చివరకు 26 జిల్లాలతో ముగించారు. అయితే ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు తెలుగు దేశం ప్రభుత్వం ఆ సంఖ్యను పెంచాలని యోచిస్తోంది. అందుకుతగ్గట్టుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రివర్గ ఉపసంఘం తాజా సమావేశం కొన్ని కీలక సిఫార్సులు చేసింది.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 26 జిల్లాల సంఖ్యను 32కి పెంచడం ఇందులో కీలకం. కొత్తగా ప్రతిపాదించిన జిల్లాలలో అమరావతి, మార్కాపురం, గూడూరు , మదనపల్లె , రంపచోడవరం పలాస ఉన్నట్టు సమాచారం. జిల్లా, రెవెన్యూ డివిజన్ల పరిధుల్ని తగ్గించాలని నిర్ణయించింది. గత పునర్వ్యవస్థీకరణ సమయంలో ఏర్పడిన లోటుపాట్లను సరిదిద్ది కొత్త వాటిని ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు తుది పరిశీలన స్థాయికి చేరాయి.

**ఏపీలో కొత్త (ప్రతిపాదిత) జిల్లాలు.. వాటి పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాలు**

1. పలాస: ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం 2. శ్రీకాకుళం: శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్నపేట, ఎచ్చెర్ల, రాజాం 3. మన్యం పార్వతీపురం: పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ 4. విజయనగరం: విజయనగరం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శృంగవరపుకోట, బొబ్బిలి 5. విశాఖపట్నం: భీమిలి, విశాఖ ఈస్ట్, విశాఖ వెస్ట్, విశాఖ నార్త్, విశాఖ సౌత్, గాజువాక, పెందుర్తి 6. అల్లూరి సీతారామరాజు అరకు: అరకు, పాడేరు, మాడుగుల 7. అనకాపల్లి: అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, తుని 8. కాకినాడ: కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం, రామచంద్రాపురం 9. తూర్పు గోదావరి రాజమహేంద్రవరం: రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, రంపచోడవరం 10. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ అమలాపురం: అమలాపురం, ముమ్మిడివరం, గన్నవరం, రాజోలు, కొత్తపేట, మండపేట 11. పశ్చిమ గోదావరి నరసాపురం: తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం 12. ఏలూరు: ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, గోపాలపురం, చింతలపూడి, పోలవరం 13. కృష్ణా మచిలీపట్నం: కైకలూరు, గుడివాడ, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు 14. ఎన్టీఆర్ విజయవాడ: విజయవాడ ఈస్ట్, విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, తిరువూరు, నూజివీడు, గన్నవరం, పెనమలూరు, మైలవరం 15. అమరావతి: పెదకూరపాడు, తాడికొండ, మంగళగిరి, జగ్గయ్యపేట, నందిగామ 16. గుంటూరు: గుంటూరు ఈస్ట్, గుంటూరు వెస్ట్, తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు 17. బాపట్ల: బాపట్ల, వేమూరు, చీరాల, రేపల్లె, పర్చూరు 18. పల్నాడు నరసరావుపేట: నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల, వినుకొండ 19. మార్కాపురం: మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి 20. ఒంగోలు: ఒంగోలు, అద్దంకి, సంతనూతలపాడు, కొండెపి, కందుకూరు 21. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు: నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు, కోవూరు, ఉదయగిరి 22. గూడూరు: గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి, సూళ్లూరుపేట 23. శ్రీ బాలాజీ తిరుపతి: తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, చంద్రగిరి 24. చిత్తూరు: చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు, పలమనేరు, కుప్పం 25. మదనపల్లి: మదనపల్లి, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి 26. సత్యసాయి హిందూపురం: హిందూపురం, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, పెనుగొండ, మడకశిర 27. అనంతపురం: అనంతపురం, రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, రాప్తాడు, శింగనమల, తాడిపర్తి 28. ఆదోని: ఆదోని, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం 29. కర్నూలు: కర్నూలు, డోన్, నందికొట్కూరు, కోడుమూరు 30. నంద్యాల: నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, బనగానపల్లె, పాణ్యం 31. వైఎస్సార్ కడప: కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, పులివెందుల 32. అన్నమయ్య రాజంపేట: రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి, బద్వేలు.

## నక్సల్స్ మూమెంట్ అంతరించే దశకు వచ్చింది.. వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** వందేమాతరాన్ని యువత స్ఫూర్తిగా తీసుకొని భారతదేశ అభివృద్ధి కోసం పని చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. ఇండియా ఎదుగుదలను చూసి పక్క దేశాలు అసూయ పడుతున్న తరుణంలో, భారతదేశ యువత మరింత మెరుగ్గా పని చేసి మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాను సరి చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిది మాత్రమే కాదని.. ఆయా రాజకీయ పార్టీలది కూడా అని సూచించారు. ఓటర్ల జాబితాలో కూడికలు, తీసివేతలు సహజమేనని.. వాటిని రాజకీయ పార్టీలు పరిశీలించుకోవాలని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. శనివారం బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్కే అద్వానీ జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు చెబ ఈక్రమంలో ఢిల్లీలోని ఎల్కే అద్వానీ నివాసానికి వెంకయ్య నాయుడు వెళ్లి కలిశారు. ఈ నేపథ్యంలో ఎల్కే అద్వానీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో వెంకయ్య నాయుడు మాట్లాడారు. భారత రాజకీయాల్లో మహోన్నత వ్యక్తి, ఉక్కు మనిషి శ్రీ లాల్ కృష్ణ అద్వానీ పుట్టినరోజు ఈరోజు అని తెలిపారు. ఎల్కే అద్వానీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి తాను ఢిల్లీ వచ్చానని పేర్కొన్నారు వెంకయ్య నాయుడు. అద్వానీకి ఉన్న దేశభక్తి, క్రమశిక్షణ, అంకిత భావం యువతకు ఆదర్శప్రాయమని కీర్తించారు. దేవుడు ఆయనకు పరిపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఎల్కే అద్వానీ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. నక్సల్స్ మూమెంట్ దాదాపు అంతరించిపోయే దశకు వచ్చిందని.. ఇది మంచిదేనని చెప్పుకొచ్చారు. నక్సల్స్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నక్సల్స్ మూమెంట్ వీక్ అయిపోయిందని విమర్శించారు. నక్సల్స్‌లో ఎవరికీ వాళ్లు తమ సిద్ధాంతాలు చెబుతారని అన్నారు. కమ్యూనిస్టుల మధ్య ఎన్నో విబేధాలు ఉన్నాయని ఆరోపించారు వెంకయ్య నాయుడు. మొదట్లో నక్సల్‌కు ప్రజల మద్దతు ఉండేదని తెలిపారు. అయితే, బుల్లెట్ కంటే బ్యాలెట్ పవర్ ఫుల్ అని ఉద్ఘాటించారు. సోషల్ మీడియాని నియంత్రించాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. ఎల్కే అద్వానీ క్రౌడ్ పుల్లర్‌గా ఉండే వారని అభివర్ణించారు. 2014లో నరేంద్రమోదీ శకం మొదలు పెట్టాల్సి వచ్చిందని గుర్తుచేశారు. అప్పటికే గుజరాత్ మోడల్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరిగిందని తెలిపారు. గుజరాత్‌లో ఆ సమయంలో నరేంద్ర మోదీ సక్సెస్ ఫుల్ చీఫ్ మినిస్టర్‌గా ఉన్నారని నొక్కిచెప్పారు. ప్రపంచంలో మల్టీనేషనల్ కంపెనీలను భారతీయులు కొనసాగిస్తున్నారని వివరించారు. అమెరికాలో పరిస్థితి దాదాపుగా మారిందని అన్నారు. ఆయా ఎన్నికల్లో భారతీయ సంతతి వాళ్లు గెలుస్తున్నారని తెలిపారు. ఇండియా ఇతర దేశాలతో పోలిస్తే చాలా తెలివైనదని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

## కొత్త కొత్త ఆవిష్కరణలకు బెజవాడ బార్ కు ప్రత్యేక స్థానం ఉంది

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్
- రాష్ట్రస్థాయి క్యారమ్, చెస్ పోటీలను ప్రారంభించిన ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ గోపి





**విజయవాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ఏపీ బార్ ఫెడరేషన్ అధ్యక్షులు ఏ. కె బాషా ఆధ్వర్యంలో నగరంలోని కోర్టుల భవన సముదాయంలో రెండు రోజులపాటు నిర్వహించ తలపెట్టిన క్యారమ్, చెస్ పోటీలను ఏపీ హైకోర్టు గౌరవ న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ గుట్టల గోపి, విజయవాడ 2వ అదనపు జిల్లా జడ్జి శ్రీ ఏ. సత్యానంద్ తో పాటు పలువురు న్యాయమూర్తులు కలసి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీలలో రాష్ట్రం లో గల 148 బార్ అసోసియేషన్ ల నుండి పోటీదారులు పాల్గొంటున్నారు. శనివారం నిర్వహించిన చెస్, క్యారమ్స్ పోటీలలో సుమారు రెండు వందల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి గౌరవనీయులైన జస్టిస్ మానవేంద్ర నాథ్ రాయ్ మాట్లాడుతూ ఇప్పుడున్న కొత్త కోర్టు సముదాయమునకు తాను విజయవాడలో జడ్జిగా ఉన్నప్పుడే పునాది పడిందని, కొత్త కొత్త ఆవిష్కరణలకు బెజవాడ బార్ కు ప్రత్యేకమైన స్థానం ఉందని, ఎంతోమంది న్యాయవాదులు, త్యాగమూర్తులు ఈ బార్ నుంచే వచ్చారని మళ్ళీ ఈ సందర్భంగా ఈ బార్ కి తనని పిలవడం అనేది చాలా సంతోషమని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ జి.గోపి మాట్లాడుతూ ఇదే విధంగా న్యాయ వాదులందరూ ఎల్లప్పుడూ ఐకమత్యంగా ఉండాలన్నారు. బార్ ఫెడరేషన్ తరపున ఏపీ రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ లను. ఒకే చోటకు చేర్చి ఈ విధంగా పోటీలను నిర్వహించడం అనేది. సామాన్యమైన విషయం కాదని, ఇలా అందరిని ఒకే చోటికి చేర్చడం చాలా సంతోషంగా వుందన్నారు. ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎ కె బాష మాట్లాడుతూ ఈ విధంగా న్యాయవాదులు అంతా ఫెడరేషన్ తరుపున పోటీలు పెట్టడం అనేది అందరం ఒకచోట కలవడానికి ఇదొక సదవకాశం అన్నారు. ఈ విధంగా న్యాయవాదులకు పోటీలు పెట్టామని దానికి అందరూ సుముఖంగా ఉండి అన్ని బార్ ఫెడరేషన్ వాళ్ళు ఇక్కడికి విచ్చేసినందుకు మరియు తమ ఆహ్వానాన్ని మన్నించి హైకోర్టు జడ్జి వచ్చి పోటీదారులను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వెస్ట్ గోదావరి జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షులు మరియు ఏపీ రాష్ట్ర బార్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ అయిన కే సీతారాం మాట్లాడుతూ ఈ విధంగా బార్ ఫెడరేషన్ తరపున ఇలాంటి పోటీలు పెట్టి అని న్యాయవాదుల ఐక్యతను చూపించారని కొనియాడారు. తదుపరి అందరూ హైకోర్టు జడ్జి ని సాదరంగా సన్మానించారు. ప్రముఖ న్యాయవాది హజరతయ్య గుప్తా శ్రీ జడ్జి గారికి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మరియు ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, ఏపీ హైకోర్టు ప్రెసిడెంట్ చిదంబరం మరియు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొని చెస్ మరియు క్యారం ఆడారు. ఈ పోటీల జరిపించడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన బెజవాడ బార్ సభ్యులైన భార్గవ్ , యు. .జాన్ విక్టరీ, పుప్పాల శ్రీని వాస్, శ్రీహరి,. గరికపాటి రామ్ తేజ, కీర్తి చైతన్య, అనీఫ్, ఉదయ్ , కే సురేష్ కుమార, వై రామకృష్ణ ,.జాన్ బాబు, సి శివ శంకర్ , సువర్ణ రాజు శిరీష లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పోటీ దారులకు సీనియర్ న్యాయవాదులు,ఎస్ కే ఎం సి వారు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.

**మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

E. P. No. 46/2025
IN
O. S. No. 73/2023

Between:
గుమ్మడి లక్ష్మీ ప్రసాద్ -----D. Hr
మరియు
దగాని బాలకృష్ణ -----J.Dr
TO.,
J.Dr:- దగాని బాలకృష్ణ, S/o. జయప్రసాద్, వ్యాపారం, R/o. C/o. S.S. బిర్యాని సెంటర్, చల్లపల్లి బస్టాండు ప్రక్కన, చల్లపల్లి, చల్లపల్లి మండలం, కృష్ణాజిల్లా.

పై నెంబర్ E.P. లో J. Dr అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది 28.11.2025 నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10.30ని. లకుపై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించబడునని ఇందుమూలంగా తెలియ చేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వులప్రకారం)

**పేర్ని సురేష్ బాబు**
D. Hr తరపున న్యాయవాది,
మచిలీపట్నం.
సెల్ : 9346422969

## మాది ప్రజా ప్రభుత్వం.. ప్రతి సమస్యను పరిష్కరిస్తా..

### -ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి సుభాష్





**రామచంద్రపురం, నవంబర్ 8 (వార్తాప్రభ) :** మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజల సంక్షేమం అభివృద్ధి మా లక్ష్యం.. వారి సమస్యల పరిష్కారానికి చెత్త సుద్దితో కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి మంత్రి సుభాష్ కు తమ విన్నపాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారి నిర్దేశించి మాట్లాడుతూ ప్రజాదర్బార్లో వచ్చిన ప్రతి అర్జీను పరిశీలించి తక్షణమే సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలే పరిష్కారం లక్ష్యంగా నియోజకవర్గాలతో పాటు రాష్ట్ర కార్యాలయంలో కూడా ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలు సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కూటమి పార్టీ నాయకులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్ తరహాలోనే ఎర్ర చందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం

### -తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**తిరుపతి, నవంబర్ 8 (వార్తాప్రభ) :** 'ఎర్రచందనం అనేది శేషాచలం అడవుల్లో తప్ప ప్రపంచంలోనే ఎక్కడా దొరకని అపురూపమైన అటవీ సంపద. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామికి గాయం అయినప్పుడు ఆయన రక్తంతో ఉద్భవించిన వృక్షంగా ఎర్రచందనాన్ని పురాణాలు చెబుతాయి. అందుకే ఈ అపురూప సంపద శేషాచలంలో తప్ప మరెక్కడా ఇంత నాణ్యతతో ఉండదు. ఇది హిందువుల మనోభావాలతో, వారి నమ్మకాలతో ముడిపడి ఉన్న గొప్ప వృక్ష సంపద. దీన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలి' అని ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కోరారు. ఎర్ర చందనం అక్రమంగా రవాణా చేసే వారంతా దీన్ని ఆపకపోతే సంవత్సరంలోగా ప్రత్యేకమైన ఆపరేషన్ ద్వారా ఎర్రచందనం అక్రమ వ్యాపారం చేసే ప్రతి ఒక్కరినీ ఏరివేస్తామని హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, ముందున్న అవకాశాలు, అవరోధాలు చర్చించేందుకు శ పవన్ కళ్యాణ్ ఐదు జిల్లాల ఎస్పీలు, రెడ్ శాండర్స్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు, అటవీ అధికారులతో శనివారం తిరుపతి కలెక్టరేట్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన సమావేశం తర్వాత పవన్ కళ్యాణ్ విలేకరులతో మాట్లాడుతూ.. "సిద్ధాంతపరమైన భావజాలం ఉన్న వామపక్ష వాద తీవ్రవాదాన్ని దేశ శ్రేయస్సు దృష్ట్యా "ఆపరేషన్ కగార్" పేరుతో కేంద్ర ప్రభుత్వం తుడిచిపెట్టేయాలని భావిస్తోంది. మేం కూడా ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధాన్ని అంతే ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాం. ఎర్రచందనం అక్రమ రవాణా చేసేవారు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలి. వారు స్వచ్ఛందంగా ఈ అక్రమ రవాణాను మానుకుంటే మంచిది.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



**విస్సన్నపేట,నవంబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ కోదండ రామాంజనేయ స్వామి వారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ఆర్యవైశ్య ఆడపడుచులు హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ రంగా దిలీప్ తెలియజేశారు. కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదాలు అందుకున్నారన్నారు. 15వ తేదీ శ్రీ రమ సమేత స్వామి వారి వ్రతంలు జరుగునని వ్రతం నోచుకునే దంపతులు మరిన్ని వివరాలకు సంప్రదించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## కృత్తివెన్ను గూడూరు మండలాల యాదవ యువజన సంఘం అధ్యక్షులు నియామకం





**పెడన,నవంబర్ 8 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గంలోని కృత్తివెన్ను గూడూరు మండలాల కు సంబంధించి యాదవ యువజన సంఘం అధ్యక్షులను శనివారం నాడు ప్రకటించారు.సంఘం నియోజకవర్గ బాధ్యులు కొలుసు చందు యాదవ్ ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కృత్తివెన్ను మండల సంఘం అధ్యక్షునిగా బోయిన బాలాజీ నియమితులయ్యారు. ఇతను కొమాళ్లపూడి గ్రామానికి చెందిన యాదవ సంఘీయుడు.సంఘంలో చురుకైనా పాత్ర పోషిస్తున్నాడు. అలాగే గూడూరు మండల సంఘం అధ్యక్షునిగా పల్లపోతు మోహన్ నియమితులయ్యారు. ఇతను గూడూరు గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకుడు. వీరిద్దరూ కూడా సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

## హనుమాన్ చాలీసా కార్యక్రమం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే





**పెనుగంచిప్రోలు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామం లో బొర్రా రమేష్ స్వగృహంలో శనివారం సాయంత్రం అయ్యప్ప స్వామి 18 వ పడిపూజ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన హను మాన్ చాలీసా కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గం శాసనస భ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, లగడపాటి ప్రవీణ్ మరియు గ్రామ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మా బాధను అర్థం చేసుకోండి మహాప్రభో!

### –రైతన్న మెండ మురళి ఆవేదన



**విస్సన్నపేట,నవంబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కలగర గ్రామంలో 343/5 భూమిలో 16 సెంట్లు స్థలం ఉన్నదని తమ కుటుంబీకులు గతంలో తమ సరిహద్దులో కంప కర్ర వెంట చింత విత్తనాలు నాటడం జరిగిందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విత్తనం మొక్క అయిందని ఆ మొక్క పెరిగి శాకోప శాఖలుగా పెరిగి పెద్ద చెట్టుగా పెరిగి ప్రధాన రహదారిని కమ్మి వేసిందని ఆయన చెప్పారు. విద్యుత్తు లైను మార్పులు చేసే క్రమంలో భాగంగా నా అనుమతితోనే రోడ్డు కు అడ్డంగా చెట్లు మండలు వరి గడ్డి ట్రాక్టర్లకు అడ్డం వచ్చే వాటిని తొలగించడం జరిగిందన్నారు. రైతు వారీగా చెట్టు కొమ్మలు తొలగి ంచాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని అయితే గ్రామానికి 24 గంటలు విద్యుత్ అవసరమని అందు కారణంగా విద్యుత్ వైర్లు కొమ్మలకు తగలకుండా ఉండేందుకు చెట్లను తొలగించేందుకు నా విజ్ఞప్తి పైనే విద్యుత్ కాంట్రాక్ట్ సంబంధిత సిబ్బంది తొలగించార న్నారు. దీనివలన రైతులందరికీ వ్యవసాయ వాహనాలు వెళ్లేం దుకు వరిగడ్డి ఇంటికి వచ్చేందుకు రహదారులు వెడల్పు అయిం దని ఆయన చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గరిమెళ్ళ భాస్కరరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు, కందిమళ్ల చెన్నారావు, మండా భాస్కరరావు, భీమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, గణపతి రెడ్డి, పంది మారేశ్వర రావు, వర్ర వెంకన్న, కంచి పోగు రామంజి తదితరులు మాట్లాడుతూ రైతులకు మేలు జరిగే విషయంలో మా ఊరు అంతా ఒకటే మాట ఒకే బాట అని చెప్పారు .

# నూజివీడు డీఎస్పీ, రూరల్ సర్కిల్ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్ కుమార్



**నూజివీడు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్ కుమార్ నూజివీడు డీఎస్పీ, రూరల్ సర్కిల్ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో శాంతి, భద్రతలు పటిష్టంగా ఉన్నాయని, జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో నేరాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూజివీడు ప్రాంతంలో ఇటీవల దొంగలను పట్టుకుని ద్విచక్ర వాహనాలను, బంగారం కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారిపై, పోక్సో కేసులను అరికట్టడానికి అన్ని చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి నియంత్రణకు పాత నేరస్తులపై నిఘా పెట్టడంతో పాటు ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న గంజాయిని సమాచారంతో పట్టుకుంటున్నట్లు తెలిపారు. నేరాల నియంత్రణకు ఆర్టిఫిషీల్ ఇంటిలిజెన్స్, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించడానికి పోలీసుల పనితీరును మెరుగుపరుస్తామన్నారు. నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చెయ్యడంతో పాటు ఇబ్బందికర పరిస్థితులు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో నేరాల నియంత్రణకు నూజివీడులో సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఉండేదని, ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా మూత పడే పరిస్తితి నెలకొందని ఐజీ జీవిజీ అశోక్ కుమార్ దృష్టికి తీసుకురాగా సిబ్బంది కొరత ఉందని, కానిస్టేబుల్స్ ను నియమించడం జరిగిందని, వారి శిక్షణ పూర్తి అయి న తర్వాత దశల వారీగా సమస్యను అధిగమిస్తామన్నారు. సిబ్బంది ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదని, సీసీ కెమెరాలు ఏర్పాటు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెంచినప్పుడే నేరాల నియంత్రణకు అవకాశం ఉందని ఐజీ జీవిజీ అశోక్ కుమార్ తెలిపారు. ట్రాఫిక్ సమస్య అన్ని పట్టణాల్లో ఉందని, ఇది ఒక్క పోలీస్ సమస్య మాత్రమే కాదన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినప్పుడే సమస్యను అధిగమించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డీఎస్పీ ప్రసాద్, పట్టణ, రూరల్ సీఐలు సత్యశ్రీనివాస్, రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

# రైతులకు ఖచ్చితంగా న్యాయం చేస్తాం..

- రైతుల పరిస్థితి పవన్ కళ్యాణ్, అచ్చంనాయుడు దృష్టికి తీసుకువెళ్ళాను.
- చల్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.





**చల్లపల్లి/అవనిగడ్డ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** రైతులకు న్యాయం చేయడానికి శతవిధాల కచ్చితంగా ప్రయత్నం చేస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం చల్లపల్లి పీఏసీఎస్ కు చెందిన గోడౌన్ ఆవరణలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నేతృత్వంలో శ్రీ గోపాలమిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావానికి పడిపోయిన చేలు మాత్రమే కాకుండా, నిలబడి ఉన్న చేలలో కూడా దిగుబడి తగ్గే అంశాన్ని తాను డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. వారిద్దరూ పంట నష్టం అంచనాలలో మానవతా దృక్పథంతో రైతులకు వెసులుబాటు కల్పించి న్యాయం జరిగేలా చూస్తా మని హామీ ఇచ్చారని తెలిపారు. కోతల సమయంలో తుఫాన్లు, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రైతులెవరు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. అవనిగడ్డ నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం కావడంతో ఇక్కడి రైతులకు ప్రాధాన్యత ఇచ్చి రక్షించుకుంటామని ఎమ్మెల్యే ప్రకటించారు. రైతులకు వీలైనంత మేరకు ప్రభుత్వం ద్వారా చేయగలిగిన సహాయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం కనీసం పంట కాలువలు, మురుగు కాలువలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో నెలకొన్న సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కారం చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అవనిగడ్డ నియోజకవర్గంలో దాదాపు రూ.5 కోట్లతో పూర్తిస్థాయిలో గుర్రప్పుడెక్క, తూటికాడ తొలగింపు పనులు చేసి రైతులకు మేలు చేశామన్నారు. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బంది పడుతున్న రైతన్నను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ఏడాది రైతుల ధాన్యం తడిచిన నేపథ్యంలో తన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి రైతులకు వెసులుబాటు కల్పించి మేలు చేశారన్నారు. ధాన్యం సొమ్ము 48 గంటల లోపు చెల్లించిన ఘనత తమ కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం తడిచిన ధాన్యం, మొక్కజొన్న పంటను ఆఫ్ లైన్ పేరుతో తరలించి సకాలంలో ఆన్లైన్ చేయకుండా సొమ్ము సకాలంలో ఇవ్వకుండా రైతాంగాన్ని నానా బాధలు పెట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం పెట్టిన ధాన్యం బకాయిలు కూడా తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెల్లించిన ఘనత తమకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, డీసీ చైర్మన్ నిడమానూరు దిలీప్ కుమార్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, మాజీ ఏఎంసీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి కే.మురళీకృష్ణ, విధంగా రవి, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, సొసైటీ సీఈఓ తోట కృష్ణారావు, మాజేరు సీఈఓ ఎస్ఎస్ చక్రపాణి, నారాయణ సేవా సమితి సిబిపిఓ శ్రీకాంత్, గోపాల మిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ మాలెంపాటి రంగారావు,టింగు అనీల్ బాబు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రేణుక, సిఈఓ జస్వంత్, చిన్నం తాతా రెడ్డి,కె.వెంకటేశ్వరరావు , శివరామకృష్ణ,జన్ను జగదీష్ సహకార సంఘాల సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## కాన్సర్ పై అందరికీ అవగానే అవసరం - డాక్టర్ ఆదిత్య వెల్లడి



**విజయవాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** "ఆధునిక కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న వ్యాధుల్లో కేన్సరు ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాదిమందిని ప్రభావితం చేసే ఈ వ్యాధి గురించి ప్రజలు సరైన అవగాహన కలిగి ఉండటం అవసరం. కేన్సర్ లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తే కేన్సరు వ్యాధిని తేలికగా అరికట్టవచ్చు " అని ప్రముఖ కేన్సరు స్పెషలిస్ట్ డా?ఎన్. ఆదిత్య పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోరీమ్లో డా?సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన "కేన్సరు" అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఊపిరితిత్తులు, వక్షోజాలు, కొలోరెక్టల్ కేన్సర్లు అత్యధికం అన్నారు. భారతదేశంలో 2022లో 14లక్షల 60వేల కొత్త కేన్సర్లు సంక్రమించగా ఈ సంవత్సరాంతానికి అవి 15లక్షల 70వేలకు చేరుతున్నాయన్నారు. మన దేశంలో పురుషుల్లో లంగ్ కేన్సరు, మౌత్, ఓరల్ కేన్సర్లు, మహిళల్లో బ్రెస్ట్ కేన్సరు, సర్వైకల్ కేన్సరు ఎక్కువ అన్నారు. ఆంధ్రప్రదేశ్లో లంగ్ కేన్సర్, స్టమక్ కేన్సరు, సర్వైకల్ కేన్సరు, బ్రెస్ట్ కేన్సరు అత్యధికంగా సంక్రమించే కేన్సర్లు అని వివరించారు. కేన్సరు స్క్రీనింగ్ రేటు 5 శాతం కంటే తక్కువ ఉండటం ఆందోళనకరమైన విషయం అన్నారు. వంశపారంపర్యంగా కేన్సరు వచ్చే అవకాశం 5–10శాతం మాత్రమే అన్నారు. కేన్సరు రావడానికి ప్రధానంగా ధూమపానం, మద్యపానం, పొగాకుకి సంబంధించిన గుట్కాలు, ఖైనీలు ప్రధాన కారణాలు అన్నారు. మద్యపానం వల్ల నోరు, స్వరపేటిక, అన్నవాహిక, జీర్ణకోశం, లివరు, పెద్దపేగులకి కేన్సరు వస్తుందన్నారు. ధూమపానం వల్ల కూడా ఎన్నో రకాల కేన్సర్లు తలెత్తుతాయన్నారు. స్థూలకాయం వల్ల 10రకాల కేన్సర్లు తయారవుతాయన్నారు. శారీరక వ్యాయామం చేసేవాళ్ళల్లో కేన్సరు రావడం తక్కువ అని పేర్కొన్నారు.. కేన్సరు వచ్చినవాళ్ళల్లో అకారణంగా కంతి ఏర్పడటం, మూత్రంతో రక్తం కలిసిరావడం, పేగుల కదలికలో మార్పులు, దగ్గు, ఛాతినొప్పి, ఆయాసం వంటి బాధలు, శరీరంలో వివిధ చోట్ల రక్తస్రావం, మొటిమలు ఉన్నట్లుండి పరిమాణం పెరగడం, ఎటువంటి కారణం లేకుండా బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. స్వరపేటిక, ఊపిరితిత్తులు, అన్నవాహిక, కోలోరెక్టమ్, బ్లాడర్ మొదలైన కేన్సర్లను శరీరంలో కలిగే మార్పులని బట్టి తేలికగా గుర్తించవచ్చన్నారు. కేన్సరు వస్తే ఇక జీవితం అయి పోతుందనే భావం కరెక్టు కాదన్నారు. కేన్సరు రాకుండా ఉండాలంటే ఆహారంలో ఎక్కువ ఫైబర్ ఉండాలన్నారు. ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువ తీసుకోవాలన్నారు. కేన్సరు నివారణలో గ్రీన్ టీ ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. గర్భాశయం ముఖద్వారం కేన్సరు రాకుండా ఆడపిల్లకి 9సంవత్సరాల నుంచి 14సంవత్సరాల లోపు హెచ్.పి.వి. వ్యాక్సిన్ ఒక నెల విరామంలో రెండు డోసులు ఇవ్వాలన్నారు. 14సంవత్సరాలు దాటితే 3డోసులు ఇవ్వాలన్నారు. కేన్సరు గురించి భయం వద్దని, ఏమాత్రం కేన్సరు లక్షణాలు కనబడినా వెంటనే డాక్టరుని సంప్రదించాలని అన్నారు. మొదటి నుండి మెరుగైన జీవ–నశైలిని పాటిస్తే కేన్సరు బారినపడటం అరుదన్నారు. సదస్సులో పలువురు అడిగిన ప్రశ్నలకు ఆయన సందేహ నివృత్తి చేసారు.

## అన్నం పెట్టడం అంటే ప్రాణం నిలబెట్టడమే



**పెదకూరపాడు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** అన్నం పెట్టడం అంటే ప్రాణం నిలబెట్టడమేనని కలియుగములో అన్నదానమే మోక్షానికి మార్గమని పెదకూరపాడు మండల సర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షులు,బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన ఆర్తిమళ్ల శేషయ్య,జానకి దంపతుల కుమార్తె హేమశ్రీ,నేతాజిల వివాహం సందర్భంగా పెదకూరపాడు మండలంలోని 75 త్యాళ్ళూరు శాంతి కాలనీలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ పేదవారికి భోజనాలు ఏర్పాటు చేసిన శేషయ్య కుటుంబీకులు అభినందనీయులన్నారు.ఈ కార్యక్రమంలో అర్తిమళ్ళ వెంకటరావు,గల్లా వసంతరావు, జనచైతన్య సమితి ప్రతినిధులు బెజ్జం నాగేశ్వరరావు,కొర్రపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా 250 మందికి అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

## శ్రీకృష్ణాలయ అభివృద్ధికి మరింత గా కృషి చేద్దాం

- శ్రీకృష్ణ ఆలయం యాదవ సేవా సంఘం కమిటీ సమావేశం నాయకుల తీర్మానం



**ప్రొద్దుటూరు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ప్రొద్దుటూరు శ్రీకృష్ణ ఆలయ యాదవ సేవా సంఘం కమిటీ సమావేశం శ్రీకృష్ణ ఆలయంలో శనివారం ఉదయం జరిగినది,కమిటీ సమావేశంలో ఆలయం గురించి కళ్యాణ మండపము, గోశాల నిర్వహణ మొదలగు విషయాలను చర్చించారు.ఆలయ అభివృద్ధి గురించి ఆహ్లాదకర వాతావరణంలో చర్చ జరిగినది. శ్రీకృష్ణ ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నాలి కృష్ణారెడ్డి యాదవ్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు తమ రోజువారి పనులను కొంత పక్కన పెట్టుకుని ఆలయ అభివృద్ధి కోసం పాటుపడుతున్నం దుకు ధన్యవాదములు తెలియజేశారు. అందరూ ఇలాగే కష్టపడుతూ శ్రీకృష్ణ ఆలయము అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయవలెనని కోరారు. కోశాధికారి ఆర్ వెంకటయ్య జమా ఖర్చుల గురించి సభ్యులందరికీ తెలిపారు. ఈ సమావేశమునకు వ్యవస్థాపక అధ్యక్షులు అయిన రామసుబ్బన్న , నాగన్న అధ్యక్షుడు దాసరి బాల సుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శి రాచకొండ వెంకటరమణ యాదవ్ మరియు కార్యవర్గ సభ్యులందరూ హాజరైనారు.

## ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల ఉద్యమం



**విస్సన్నపేట,నవంబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ఉద్యమానికి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరావు దంపతులు, పట్టణ పార్టీ అధ్యక్షులు నెక్కలపు వెంకట కుటుంబరావు వార్డ్ మెంబర్ సానం సత్యవతి నాగేంద్రరావు దంపతులు మాజీ వార్డ్ మెంబర్ వై నాగ నాంచారయ్య పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసిన వైసీపీ ఆర్యవైశ్య వింగ్



**విస్సన్నపేట,నవంబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వైసిపి ఆర్యవైశ్య వింగ్ ఆధ్వర్యంలో పేదలకు సన్న బియ్యం ప్యాకెట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి జ్యూయలరీస్ అధినేత కుక్కడపు శ్రీనివాసరావు, పరసా నాగేశ్వరరావు, కుక్కడపు రాము తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం కార్యక్రమం



**తిరువూరు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నాగు బండి రామారావు సామ్రాజ్యం వీ కన్వెన్షన్ అధినేత మరియు ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కలియుగ దైవం వెంకటాచల స్వామి దేవస్థానము నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అన్నదాన కార్యక్రమానికి భక్తులు భారీగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో నాగు బండి రామారావు సామ్రాజ్యం వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన పర్వతం శ్రీనివాసరావు జంగాల మురళి



**తిరువూరు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** తిరువూరు కలియుగ దైవం శ్రీ వెంకటాచల స్వామి వారి దేవస్థానం చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన పర్వతం శ్రీనివాసరావు మరియు బస్టాండ్ వద్ద గల శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన జంగాల మురళి వారితో పాటు పాలకమండ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమా నికి తెలుగుదేశం పార్టీ బిజెపి జనసేన నాయకులు పాల్గొన్నారు నూతనంగా ఎన్నికైన చైర్మన్లను అభినందించిన కూటమి నాయకులు

## మహిళ గొంతు కోసి దారుణ హత్య



**దుండిగల్, నవంబర్ 8, (వార్తాప్రభ) :** మహిళను గొంతు కోసి అతి దారుణంగా హత్య చేసిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా తిమ్మాపూర్ కు చెందిన సుజాత (30) 2015 వివాహం జరిగింది. అయితే కొన్ని గొడవల కారణంగా కొన్నిళ్లుగా భర్తతో దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో బహదూర్ పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో అద్దెకుకుంటూ ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ఆమెకి ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది కాస్త అక్రమ సంబంధానికి దారి తీసింది. సదరు వ్యక్తితో ఆమెకి తరచూ గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఈ క్రమంలోనే అతనికి సంబంధించిన వ్యక్తులు హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఘటన స్థలంలో సీసీ కెమెరాలు ఉన్నాయని ఇద్దరు వ్యక్తులు అక్కడికి వెళ్లినట్లు కెమెరాలో రికార్డు అయ్యాయని, ఇది ఇలా ఉంటే రాజేష్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్లో లొంగిపోయినట్లు మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు





**కీసర, నాగారం, నవంబర్ 08:(వార్తా ప్రభ)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగామేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో ఆదర్శ వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషనల్ సొసైటీ వృద్ధాప్య ఆశ్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ముఖ్య అతిథులుగా జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మరియు దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పురామారావు, ఈ సందర్భంగా బాల్ రెడ్డి ఆదర్శ వృద్ధాశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు భోజనాలు నిర్వహించిన మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరియు బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేతా రాజు ముదిరాజ్ ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ టీజేఎస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సంజీవరెడ్డి బాల్ రెడ్డి, గోవింద్ సింగ్, మాదిరెడ్డి రాజిరెడ్డి, దిలీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుని ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న..

## మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్



**జవహర్ నగర్, నవంబర్ 08:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గబ్బిలాల పేట నివాసితులు తూరుగొండ సుగుణ కొమురయ్య ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు, ఇల్లు నిర్మాణ భూమి పూజ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కూతాడి సాయి, తురుగొండ రామన్న మాదిగ, గబ్బిలాల పేట వ్యవస్థాపకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానందం, కోటేష్ గౌడ్, గబ్బిలాల పేట నాయకులు కరాటే రాజు, మేడ నాగభూషణం, మంద ఆనంద్ మాదిగ, గడ్డమీది విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, మబ్బు అంజయ్య, పేరం శ్రీనివాస్, ఇల్లు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు,మరియు తదితరులు పాల్గొన్నారు.

### నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీ రాఘవేంద్ర స్వామి అసోసియేషన్ కాలనీ సభ్యులు



**కీసర, నాగారం, నవంబర్ 08:(వార్తా ప్రభ)** నాగారం మున్సిపల్ పరిధి లోని శ్రీ రాఘవేంద్ర స్వామి వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు శనివారం నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా తమ కాలనీలో ఉన్న డ్రైనేజ్, సిసి రోడ్ సమస్యలపై శ్రీనివాస్ రెడ్డితో చర్చించిన కాలనీవాసులు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుంకి సుదర్శన్, ప్రేమ్ చంద్ర రెడ్డి, వందరి వేణు, రమేష్ బాబు, వేణుగోపాల్, యశ్వంత్ రెడ్డి, రామారావు,తదితరులు పాల్గొన్నారు.

## అగర్వాల్ సమాజ్ కార్తీక పౌర్ణమి స్నాన యాత్ర







**హైదరాబాద్ : నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అగర్వాల్ సమాజ్ లకడీ కా పుల్ శాఖ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి (డుబ్కి పూనమ్) పావన సందర్భంగా బాసరలోని గోదావరి నదిలో స్నాన యాత్రను విజయవంతంగా నిర్వహించారు. ఈ పవిత్ర యాత్రలో మొత్తం 42 మంది సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సభ్యులందరూ ఉదయం 7 గంటలకు బస్సులో బాసరకు బయలుదేరారు. మధ్యాహ్నం బాసరకు చేరుకుని అందరూ గోదావరి నదిలో శ్రద్ధా భక్తులతో స్నానం చేసి, విద్యా దేవత అయిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. యాత్ర సందర్భంగా శాఖ తరపున అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాలకు చక్కటి ఏర్పాట్లు చేశారు. యాత్ర వాతావరణం రోజంతా ఆనందంగా సాగింది. సభ్యులందరూ రాత్రి 7 గంటలకు తిరుగు ప్రయాణం ప్రారంభించి అర్ధరాత్రికి సురక్షితంగా వారి నివాసాలకు చేరుకున్నారు. ఈ యాత్ర విజయవంతం కావడంలో ఛైర్మన్ విజయ్ కుమార్ అగర్వాల్, యాత్ర కన్వీనర్ రాజీవ్ అగర్వాల్, అధ్యక్షులు సునీల్ కుమార్ అగర్వాల్, మంత్రి జై కుమార్ అగర్వాల్, సహ మంత్రి ముఖేష్ అగర్వాల్, కోశాధికారి అర్జున్‌లాల్ అగర్వాల్, గోవింద్ రామ్, ముఖేష్ మోడీ సహా ఇతర సభ్యులు విశేషంగా సహకరించారు. ఈ యాత్ర సభ్యులందరికీ ఆధ్యాత్మిక, ఆత్మీయ అనుభూతిని అందించింది.

## తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న పాలనాదక్షుడు రేవంత్ రెడ్డి.

**● పేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలిస్తున్న ప్రజానాయకుడు సీఎం రేవంత్ రెడ్డి ● వారి నాయకత్వం, ధైర్యం, ప్రజల పట్ల ప్రేమ తెలంగాణకు కొత్త ఊపునిచ్చింది ● తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలతో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన అందిస్తున్న పాలమూరు పులి బిడ్డ రేవంత్ రెడ్డి ● టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం."**




**కూకట్ పల్లి,నవంబర్ 8 (వార్తాప్రభ):** జనహృదయ నేత భవిష్యత్తు తరాలకు ఆశాకిరణం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్ నగర్ వెంచర్ 3 లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా హాజరై కేక్ కట్ చేసిన గుత్తా అమిత్ రెడ్డి చైర్మన్ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ సారథిగా సమర్ధవంతంగా పని చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.మీరు చూపిస్తున్న మార్గం యువతకు స్ఫూర్తి, ప్రజలకు ఆశ. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలతో పాటు, మీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాపాలనలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా, ప్రతి ఇంటా వెలుగులు నింపి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత పని చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, తెలంగాణను సుభిక్షం వైపు నడిపించే శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారావు, అరుణ గారపాటి, రత్నకుమారి, రాజేశ్వరీ, లక్ష్మీ, రాజ్, జై సూర్య, నరసింహా యాదవ్, రాము గౌడ్, అరుణ్ గౌడ్, ఎం.రాము, శేఖర్ గజానంద్, కనకయ్య, శివ జెల్ల, మహేష్ ముదిరాజ్, అనూష, రమాదేవి, గుండ జ్యోతి, భారతమ్మ, రజిత, జోజమ్మ, విజయలక్ష్మి, లావణ్య, అనిత, కృష్ణవేణి, సాయి భారతి, అహ్మద్, సోను, శేఖర్ యాదవ్, పల్లపు వేణు, సుధీర్, చందు, యాదగిరి, సతీష్ రెడ్డి, రవి ముదిరాజ్, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలు సేవా సంస్థల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**మేడ్చల్ వికలాంగుల సంఘ అధ్యక్షులు మెరుగు శివకృష్ణ.**




**కూకట్ పల్లి,నవంబర్8(వార్తాప్రభ):** పేదలు సేవా సంస్థల సహాయాన్ని సద్వినియోగం చేసుకొని వారి సేవలను గుర్తుంచుకోవాలని మేడ్చల్ జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు మెరుగు శివకృష్ణ అన్నారు.సిద్దిపేట జిల్లా చిట్యాల మండలం చెందిన పోచయ్య అనే 70 సంవత్సరాల వృద్ధుడు షుగర్ వ్యాధి వల్ల కాలును తీసేశారు. సంవత్సరం పాటు కాలు లేదని పోచయ్య ఎంతో బాధపడ్డాడు తను మరల ఎవరి సహాయంం లేకుండా నడవాలని అనుకున్నాడు. దీనితో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు శివకృష్ణను సంప్రదించి తనతో విన్నవించుకున్నాడు. తన బాధను విన్న శివకృష్ణ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండతో చర్చించి భారత్ వికాస్ చారిటబుల్ ట్రస్ట్ ను కోరారు. కూకట్‌పల్లి భారత్ వికాస్ పరిషద్ చారిటబుల్ ట్రస్ట్ సహాయ సహకారులతో కృత్తిమ కాలును పోచయ్యకు మేడ్చల్ జిల్లా వికలాంగుల అధ్యక్షులు మెరుగు శివకృష్ణ పెట్టించారు. ఈ సందర్భంగా తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ మాట్లాడుతు నిరుపేదలకు తోచిన రీతిన సాయ మందించడంలోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని, ఎంత సంపాదించామన్న దానికంటే ఎందరికి సాయం చేశామన్నదే ముఖ్యమని అన్నారు. భారత్ వికాస్ పరిషద్ చారిటబుల్ ట్రస్ట్ నిరుపేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్టు సభ్యులైన నరేందర్, మధు, స్వామి రఘును టీవీ హెచ్ ఎస్ఎస్ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పెద్దగొల్ల నాగరాజు, మహిళా నాయకురాలు యశోద పాల్గొన్నారు.

## బీసీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్..

***నియామక పత్రం అందించిన రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ..***



**హైదరాబాద్, నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి).** తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జరిగింది. భవిష్య ప్రణాళిక సమాలోచనలు రాబోవు సంస్థ గత స్థానిక ఎన్నికలు జిహెచ్ఎంసి మున్సిపల్ ఎన్నికల గురించి సుదీర్ఘంగా చర్చించటం జరిగింది. అధికారమే అంతిమ లక్ష్యంగా బీసీలు అందరూ ఏకమై ఐకమత్యంతో ఎస్సీ ఎస్టీ మైనార్టీల సహకారంతో బహుజన రాజ్యాధికారం సాధించాలని కార్యవర్గ సమావేశంలో తీర్మానించడం జరిగింది. విద్యా ఉద్యోగం ఉపాధి, వైద్యం లక్షలు లక్షల ఖర్చు ఉన్నందున, ఉచిత విద్య ఉచిత వైద్యం కల్పించాలని పేదరిక నిర్మూలనలో భాగంగా రోటి కప్పుడా మఖాన్ ఉపాధి ద్వారా కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. కార్యవర్గం సమీకరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల బిసి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండి రామకృష్ణ గౌడ్ ని నియమించి, నియామక పత్రం ను అధ్యక్షులైన బేరి రామచందర్ యాదవ్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యవర్గ సమావేశంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, వనపర్తి జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల అధ్యక్షులు మధు యాదవ్, ప్రధాన కార్యదర్శి బండి రామకృష్ణ గౌడ్, అతిథిగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డప్పు కొట్టు హరిబాబు, పాములేటి యాదవ్, సినీ ఆర్టిస్ట్ లక్ష్మీనారాయణ యాదవ్, బీసీ కులాల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం అమ్మకు అక్షరమాల కార్యక్రమం



**ములుగు, నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ములుగు మండలంలోని నవభారతి మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమాలపై గ్రామంలోని గ్రామ సంఘం ప్రతినిధులకు మరియు ఉల్లాస్ కార్యక్రమాలపై శిక్షణ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్డిఏ పిడి శ్రీనివాస్ రావు హాజరై మాట్లాడుతూ మహిళలు అందరూ కూడా సంపూర్ణ అక్షరాస్యత సాధించే విధంగా కృషి చేయాలని అక్షరాస్యత 100% సాధించాలని తెలిపారు. అక్షరాస్యతోనే మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందుతారని అన్నారు గ్రామస్థాయిలో వాలంటీర్ల ద్వారా చదువుకొని మహిళలకు అక్షర వికాసం ద్వారా చదువు నేర్పించడం జరుగుతుందని తెలిపారు ఈ సందర్భంగా అక్షర వికాసం మరియు ఉల్లాస్ పుస్తకాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పి శ్రీనివాస్ ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణ బాబు, వేణుగోపాల్ డిపిఎం భవాని, ఎంఈఓ తిరుపతి ,ఏపిఎం శ్రీనివాస్, సీసీలు, ఉల్లాస్ సిఆర్పిలు, గ్రామ సంఘం ప్రతినిధులు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.


# వార్తా ప్రభ
# హైదరాబాద్

### శ్రీ వెంకటేశ్వర పద్మావతి అమ్మ వార్ల కళ్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,నవంబర్ 8 (వార్తాప్రభ):** చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ రోడ్డు లో గల సాయి రాఘవ అపార్ట్మెంట్స్ లో జరిగిన శ్రీ వెంకటేశ్వర పద్మావతి అమ్మవార్ల కళ్యాణమహోత్సవం కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,రఘునాథ్ రెడ్డి,నరేందర్ బల్లా మరియు అపార్ట్మెంట్ వాసులు మరియు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థి మృతికి కారణమైన రిజిస్టర్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావుపై చర్యలు తీసుకోవాలి - విద్యార్థి నాయకులు



**నిజాంపేట్, నవంబర్ 8, (వార్తాప్రభ) :** బాచుపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థి మృతికి కారణమైన రిజిస్టర్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావుపై చర్యలు తీసుకోవాలని డిఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శీను నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి సాయి నగర్ ప్రాంతంలో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో టిఆర్ఎస్వి ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయంలో దళిత గిరిజన బహుజన విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో ఆత్మహత్య చేసుకున్న బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ మూడవ సంవత్సరం చదువుతున్న పరుశురాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

### శిల్పారామం లో అలరించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి,నవంబర్ 8 (వార్తాప్రభ):** మాదాపూర్ లోని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం తిల్లాన ఆర్ట్స్ అకాడమీ భరతనాట్య గురు మాధవి మారేళ్ళపూడి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. జయ జయ శంభో,అలరిపు,జతిస్వరం,నటేశ కౌతం,కమల సులోచన,నిత్య కళ్యాణి,సింహాసనస్థితే,రారా వేణు,తిల్లాన అంశాలను అదితి,అభిజ్ఞ,అన్విత,అన్వి,అమృత,అంశు మాల,ఆరాధ్య,అస్మి, దియా,దివిష,దీక్ష,ధాత్రిష్ట,దీక్ష, హరిప్రియ,చార్వి,ఇషితా,లోషిత, శామృద్ధి,సింధూజ,సన్నిధి,మేధాశ్రీ లు ప్రదర్శించి మెప్పించారు.

## నవీన్ యాదవ్ గెలుపు ఖాయం

**క్షమాపణ చెప్పకపోతే... కార్పొరేటర్ బట్టలు చించుతాం**
**కాంగ్రెస్ నేత పులి శ్రీకాంత్ పటేల్ హెచ్చరిక**



**కూకట్ పల్లి నవంబర్ 8(వార్తాప్రభ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఆర్ పార్టీ బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి బట్టలు చించుతామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పులి శ్రీకాంత్ పటేల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ లో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దుర్భాషలాడి అనుచిత వ్యాఖ్యలు చేసిన వార్తా వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడాన్ని గమనించి బాలానగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పులి శ్రీకాంత్ పటేల్ స్పందించారు. శనివారం ఆయన ఇంట్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సుమారు 30 వేల మెజారిటీతో చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్ గెలవబోతున్నాడని, గెలుపు సంబరాలను బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి కార్యాలయం ముందు జరుపుకుంటున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఈనెల 14లోపు క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి, నీకు కూడా ఒక తండ్రి వలె భావించాల్సింది పోయి నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎడిటోరియల్


## త్యాగ పురుషుడు అద్వానీ

లాల్ క్రిష్ణ అద్వానీని అంతా లోహ పురుషుడు అంటారు. అంటే ఉక్కు మనిషి అని. అయితే ఆయనలో పట్టుదల ఉక్కు లాంటిదే. అందుకే ఆయన రామజన్మ భూమిని విషయం మీద అతి పెద్ద రథాయాత్రను చేపట్టారు. దేశంలో హిందువుల ఓట్లను కన్సాలిడేట్ చేశారు. అదే సమయంలో ఆయన బీజేపీకి కొత్త ఊపు తీసుకుని వచ్చారు. దేశంలో బీజేపీ రోజున ఈ స్థితిలో ఉంది అంటే దానికి ఎల్ కే అద్వానీ తీసుకున్న నిర్ణయాలు అంతే కాదు ఆయన ఆలోచనలు పార్టీ పట్ల దేశం పట్ల ఆయన చిత్తశుద్ధి ఇలా అనేక కారణాలు కనిపిస్తాయి. బీజేపీలో అద్వానీ శకం మొదలయ్యాకనే కాషాయం పార్టీ దేశంలో వికసించింది అన్నది తెలిసిందే. 1984లో వాజ్ పేయి జాతీయ అధ్యక్షుడిగా ఉండగా కేవలం రెండు ఎంపీ సీట్లకే పరిమితం అయిన బీజేపీని అయిదేళ్ళ కాలంలోనే 89 సీట్లకు పెంచిన ఘనత ఎల్ కే అద్వానీదే. ఆయన బీజేపీకి 1986లో జాతీయ అధ్యక్షుడు అయ్యారు. ఆ తరువాత బీజేపీ పరుగులు పెట్టింది. 1991 నాటికి తన సీట్ల సంఖ్యను మరింత పెంచుకున్న బీజేపీ 1996 నాటికి 160కి పైగా ఎంపీ సీట్లు సాధించడమే కాదు దేశంలో తొలిసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఆనాడు అలా వచ్చిన అవకాశాన్ని ఎల్ కే అద్వానీ తాను తీసుకోలేదు తన ప్రియ స్నేహితుడు అటల్ బిహారీ వాజ్ పేయికి ఇచ్చారు. ఆ తరువాత 1998, 1999 లలో వాజ్ పేయ్ ఈ దేశానికి ప్రధానిగా ఉన్నారు. మొత్తం ఆరున్నరేళ్ల పాటు వాజ్ పేయి ప్రధానిగా ఉంటే ఆయన వద్ద ఉప ప్రధానిగా అద్వానీ పనిచేశారు. తనకు తరువాత కాలంలో అవకాశం వస్తుందా రాదా అన్నది కూడా ఆలోచించకుండా వాజ్ పేయి మీద ఉన్న అవ్యాజమైన ప్రేమ అనురాగం. గురు భావం, ప్రియ స్నేహితం ఇవన్నీ అద్వానీ కీలక సమయంలో చూపించారు. వర్తమాన రాజకీయాలను చూస్తే ఎవరికైనా అద్వానీ చేసిన త్యాగం ఎంత నిరుపమానమో అర్థం అవుతుంది. ఎందుకంటే ఈ రోజున పదవే పరమావధిగా పాలిటిక్స్ సాగుతోంది. తామే నిరంతరం అధికారంలో ఉండాలనుకుని ఏమైనా చేసే కల్చర్ సాగుతోంది. అయితే ఇప్పటికి మూడు దశాబ్దాల క్రితం అద్వానీ మాత్రం అలా చేయలేదు, పార్టీలో తన కన్నా సీనియర్ అయిన వాజ్ పేయి కే ప్రధాని పీఠం అప్పగించి తాను రెండవ స్థానంలో కుదురుకున్నారు. అయితే అద్వానీకి ఏనాడు అయినా ప్రధాని అవకాశం వస్తుందని ఆశించిన ఆయన అభిమానులకు మాత్రం అది ఎప్పటికీ చేదు నిజంగానే మారింది. ఒక విధంగా చెప్పాలంటే అద్వానీ పార్టీని నిలబెట్టి తాను మాత్రం తెర వెనక్కి వెళ్ళిపోయారు. ఆయన శిష్యుడు నరేంద్ర మోడీ దేశానికి 2014లో ప్రధాని అయ్యారు. అయితే 2014లో బీజేపీ విజయం సాధించిన వెంటనే ప్రధాని పదవిని అద్వానీ పేరుని పరిశీలిస్తారు అన్న ప్రచారం అయితే సాగింది. కానీ అలా జరగలేదు. అయితే దేశంలో మరో ఉన్నత పదవి అయిన రాష్ట్రపతి పీఠం అయినా ఆయనకు అందుతుందని అనుకున్నారు. 2017లో రాష్ట్రపతి ఎన్నికల వేళ పెద్ద ఎత్తున అద్వానీ పేరు ప్రచారంలోకి వచ్చింది. కానీ జరిగింది వేరు. ఇక 2019 నాటికి మరోసారి ఎన్నికల్లో పోటీ చేసేది లేదని అద్వానీ చెప్పేసి రాజకీయంగా శాశ్వతంగా తప్పుకున్నారు. ఒక విధంగా ఆయన పార్టీ కోసం ఎంతో చేసి కీలక స్థానాలను అయితే అందుకోలేకపోయారు అన్న వెలితి అయితే అభిమానులలో ఈ రోజుకీ ఉంది. ఇదిలా ఉంటే నవంబర్ 8 అంటే అందరికీ గుర్తుకు వచ్చేది అద్వానీ పుట్టిన రోజు. అలా శనివారం ఆయన పుట్టిన రోజున దేశమంతా ఆయనను తలచుకుంటోంది. ఆయనకు శుభాకాంక్షలు తెలియచేస్తోంది. ఎల్కె అద్వానీ 98వ జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. అద్వానీ మంచి ఆరోగ్యం దీర్ఘాయుష్షుతో ఉండాలని మోడీ ఆకాక్షించారు. అద్వానీని అత్యున్నత దృష్టి మేధస్సు కలిగిన రాజనీతిజ్ఞుడిగా మోడీ అభివర్ణించారు. భారతదేశం పురోగతిని బలోపేతం చేయడానికి ఆయన జీవితాన్ని అంకితం చేశారని ప్రధానమంత్రి కొనియాడారు. అద్వానీ చేసిన కృషి భారతదేశం ప్రజాస్వామ్య రంగం మీద చెరగని ముద్ర వేసిందని ప్రధానమంత్రి అన్నారు. అద్వానీని ఒక విశిష్ట రాజనీతిజ్ఞుడిగా భారత ప్రజాస్వామ్య ప్రయాణంలో మార్గదర్శక శక్తిగా ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. అద్వానీ తన జీవితాన్ని దేశ పురోగతి, ఐక్యత సాంస్కృతిక సామరస్యం కోసం అంకితం చేశారని ఆయన అన్నారు. అద్వానీ దార్శనిక నాయకత్వం ప్రజా సేవ పట్ల లోతైన నిబద్ధతను ప్రదర్శించారని అన్నారు. ఆయన సహకారం భారతదేశ రాజకీయ, సామాజిక మరియు సాంస్కృతిక దృశ్యాన్ని రూపొందించిందని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు కూడా అద్వానీకి పుట్టినరోజు వేళ శుభాకాంక్షలు తెలిపారు.

## యాదగిరిగుట్టలోతెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**యాదాద్రి భువనగిరి నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యాదగిరిగుట్ట లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు సుడుగు జీవన్ రెడ్డి యాదగిరిగుట్ట దేవస్థానం మాజీ ధర్మకర్త పెలిమేల్లి శ్రీధర్ గౌడ్ యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్ సయ్యద్ సలీం పాపగారి రాజిరెడ్డి పసుపు రజినీకాంత్ లకన్ భాయ్ జమాల్ బాయ్ మోత్కుపల్లి నవీన్ వడ్డరి గణేష్ దుర్గయ్య రాజు తదితరులు పాల్గొన్నారు

## పనికొచ్చే పలుకులు




పూలలా వాడిపోయే
అందాన్ని నమ్మకోకు
చెదలలా హానిచేసే
గర్వాన్ని పెంచుకోకు
ఆపదలో ఆదుకునే
ఆప్తులను పోగొట్టుకోకు
మన క్షేమం కోరుకునే
మనుషులను నొప్పించకు
వ్యర్థమైన తలపులతో
కఠినమైన మనసుతో
జీవితాన్ని కోల్పోకు
కదు చెదు వ్యసనాలతో
ఒక్కింత యోచించుము
జాగ్రత్తగా సాగుము
నష్టము జరిగిన పిదప
ఎదబాదుకుని ఏడ్వకు

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు సెల్:9966 414580

# రాష్ట్ర ముఖ్యమంత్రులతో మెప్పు పొందిన వారు పశ్చిమ లో ఇద్దరే ఇద్దరు

- నాడు పశ్చిమ ట్రాఫిక్ ఎస్ ఐ దంగేటి అర్జునరావు, నేడు కొత్తపేట సి.ఐ. ఎస్ చిన కొండలరావు
- టూ టౌన్ సిఐ కొండలరావు కి సీఎం నుంచి ప్రత్యేక అభినందనలు

(యేమినేని వెంకట రమణ)

**విజయవాడ పశ్చిమ నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పోలీసులు విధులు నిర్వహించడం వేరు...అంకిత భావంతో మొండిగా అడుగులు ముందుకు వేయడం వేరు. ఒకరు ప్రాణాలు లెక్కచేయకుండా ఓ వృద్ధురాలి ప్రాణాలు కాపాడి ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తో అభినందించ బడ్డారు. మరొకరు ప్రకృతి విళయానికి ఎదురెల్లి ఇద్దరు వృద్ద దంపతులు ప్రాణాలు కాపాడారు. ఇద్దరూ విజయవాడ వెస్ట్ డివిజనులో విధులు నిర్వహిస్తున్న వారే......దంగేటి అర్జునరావు వెస్ట్ డివిజనులో ట్రాఫిక్ ఎస్ ఐ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో సుమారు ఆరేళ్ల క్రితం ఓ వృద్ధురాలు బందరు కాలువలో ప్రమాదవశాత్తు జరిపడగా ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కాలువలో దూకి ఆమె ప్రాణాలు కాపాడారు. అప్పట్లో ఆ సంఘటన సంచలనం సృష్టించింది. సమాచారం అందుకున్న ఆనాటి ముఖ్యమంత్రి అర్జునరావు ని స్వయంగా అభినందించారు. నేడు మొంథా తుపాను సమయంలో అద్భుత సేవలు,ప్రకృతి విపత్తు ని సైతం లెక్కచేయకుండా కొత్తపేట సి ఐ ఎస్ చిన కొండలరావు 200 మెట్లు ఎత్తులో ఉన్న కొండప్రాంత ఇంటినుంచి వృద్ద దంపతులను పునరావాస కేంద్రం కి బలవంతంగా తరలించారు. కొద్ది సేపటి కే ఆ ఇల్లు నేలమట్టం అయ్యింది. అంటే ఇద్దరి ప్రాణాలు కాపాడినట్టేగా... ఆ సమయంలో మొండిగా విధులు నిర్వహిస్తున్న సి ఐ అందించిన సేవలు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ శాఖల సిబ్బందిని సీఎం నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముందస్తు చర్యల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం భారీగా తగ్గించగలిగామని, ఈ క్రమంలో పనిచేసిన అధికారులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విపత్తు సమయంలో విశేష సేవలు అందించి ప్రజల ప్రాణాలను కాపాడిన 175 మంది ' కు సీఎం స్వయంగా సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా గుర్తింపు




పొందినవారిలోటూ టౌన్ సిఐ శ్రీ కొండలరావు కూడా ఒకరు. మొంథా తుపాను తీవ్రత పెరిగిన సమయంలో కొండ ప్రాంతాల్లో పరిస్థితులు క్షీణించినప్పటికీ, సిఐ కొండలరావు స్వయంగా టీంతో కలిసి కొండ ప్రాంతంలోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, ప్రమాదం ఉన్న ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తక్షణ స్పందన, ప్రజలతో నేరుగా మమేకం అవుతూ నిరంతర పర్యవేక్షణ చేయడం ద్వారా ఎన్నో కుటుంబాలను రక్షించారు. ఈ ప్రమాద సమయంలో చూపిన ఆయన సేవలు ప్రజల నుంచి విశేష ప్రశంసలు అందుకు వారికీ ఈ గౌరవం దక్కింది. ఇక్కడ చెప్పుకో దగ్గ అంశం ఏమిటంటే. ఆనాడు జగన్మోహన్ రెడ్డితో, నేడు నారా చంద్రబాబు నాయుడుతో అభినందనలు పొందిన ఇద్దరూ వెస్ట్ డివిజనులో విధులు నిర్వహిస్తున్న వారే కావడం గమనార్హం.

# పరిశోధనలతో బోధనకు పదును





**విజయవాడ పశ్చిమ, నవంబరు 8:(వార్తా ప్రభ ప్రతినిధి)** రోజువారీ బోధనతో పాటు అధ్యాపకులు పరిశోధనలపై దృష్టి సారించాలని, అందువల్ల బోధన నైపుణ్యాలు, నాణ్యత మరింత పెరుగుతాయని పుణె కు చెందిన ఎం.ఐ.టి వరల్డ్ పీస్ యూనివర్శిటీ రీసెర్చ్ అండ్ డవలప్మెంట్ సెల్ డీన్ ప్రొఫెసర్ చావలి మూర్తి అన్నారు. కె.బి.ఎన్. కళాశాల ఇంటర్నల్ క్వాలిటీ ఎసెస్మెంట్ సెల్‌బీ రీసెర్చ్ సెల్ సంయుక్త నిర్వహణలో శనివారం కళాశాల అధ్యాపకులకు "ఫండింగ్ ఏజెన్సీలకు ప్రాజెక్ట్ ప్రతిపాదనలు రచన" అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న మూర్తి మాట్లాడుతూ పరిశోధనకు తగిన అంశాన్ని ఎంచుకోవటంతో పాటు ఫండింగ్ అవకాశాలను గుర్తించడం కీలకమన్నారు. పరిశోధనకు తగిన ప్రతిపాదన రాయటమే పరిశోధన నాణ్యత నిర్ణయిస్తుందన్నారు. ప్రతిపాదన నిర్మాణం, లక్ష్యాలు, విధాన రచన గురించి ఉదాహరణ పూర్వకంగా వివరించారు. ఫండింగ్ ఏజన్సీలు అనుసరించే మార్గదర్శక నియమాలు తెలియజేసారు. సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవటంతో పాటు నైతిక విలువలను పరిశోధకులు తప్పకుండా పాటించాలన్నారు. అధ్యాపకులు అడిగిన అనేక ప్రశ్నలకు విశ్లేషణాత్మకమైన సమాధానాలు ఇచ్చారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం కూడా పరిశోధనకు పెద్దపీట వేసిందని, అధ్యాపకులంతా బోధనతో పాటు పరిశోధనలు తప్పనిసరిగా చెయ్యాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ఫండింగ్ ప్రాజెక్ట్స్ మీద అధ్యాపకులు దృష్టి కేంద్రీకరిచాలని సూచించారు. ఐక్యుఎసి కోర్డినేటర్ షమీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, డాక్టర్ కె.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు ప్రత్యేక ఆహారం పెట్టు ప్రదేశాల ఏర్పాటు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర







**విజయవాడ పశ్చిమ నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు ప్రత్యేక ఆహారం పెట్టే ప్రదేశాల ఏర్పాటు చేసినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నగర పరిధిలోని వివిధ ప్రాంతాలలో వీధి కుక్కల కోసం ప్రత్యేకంగా ఆహారం పెట్టు ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు దీనిని గమనించి కేవలం కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే వీధి కుక్కలకు ఆహారం పెట్టవలెనని నగర ప్రజలను కోరారు. నగరంలోని వీధి కుక్కలను ఇప్పటికే అజిత్ సింగ్ నగర్ లో ఉన్న ఆపరేషన్ థియేటర్లలో యాంటీ బర్త్ కంట్రోల్ నిర్వహిస్తూ ప్రత్యేక వాక్సినేషన్ డ్రైవ్లు చేస్తూ వీధి కుక్కల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడమే కాకుండా నగర ప్రజలకు వీధి కుక్కలు దాడి చేయకుండా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని, ప్రస్తుతం నగర పరిధిలోని 61 ప్రాంతాలలో వీధికుక్కల కోసం ఆహారం పెట్టు ప్రదేశాలను గుర్తించి ఫీడింగ్ జోన్లు ఏర్పాటు చేశామని, రానున్న కాలంలో మరిన్ని పెంచనున్నామని తెలిపారు. నగర ప్రజలు కూడా దీనికి సహకరించి కేవలం వీధి కుక్కలకు ఆహారం పెట్టు ప్రదేశాలలోనే ఆహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మాది ప్రజా ప్రభుత్వం..ప్రతి సమస్యను పరిష్కరిస్తా..

### ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజల సంక్షేమం అభివృద్ధి మా లక్ష్యం.. వారి సమస్యల పరిష్కారానికి చెత్త సుద్దితో కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి



వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి మంత్రి సుభాష్ కు తమ విన్నపాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారి నిర్దేశించి మాట్లాడుతూ ప్రజాదర్బార్లో వచ్చిన ప్రతి అర్జీను పరిశీలించి తక్షణమే సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలే పరిష్కారం లక్ష్యంగా నియోజకవర్గాలతో పాటు రాష్ట్ర కార్యాలయంలో కూడా ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలు సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కూటమి పార్టీ నాయకులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## వి.యం.సి లో శ్రీ కనకదాస్ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**విజయవాడ పశ్చిమ నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భక్త కనకదాసు ప్రధాన రచనలు కన్నడంలో రచించిరట్లు అదనపు కమిషనర్ (జనరల్) ఏ. రవీంద్రరావు తెలిపారు. శనివారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద శ్రీ కనకదాసు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (జనరల్) ఏ.రవీంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భక్త కనసాదాసు 516వ జయంతి వేడుకల లో సందర్భంగా భక్త కనకదాసు గురించి ప్రతి ఒక్కరు తెలుసుకునే ఆవశ్యకత ఉందని, కనకదాసు నరసింహ స్తోత్రం, రామధ్యాయ మంత్రం, మోహన తరంగిణి అనే వాటిని రచించినట్లు వివరించారు. నలచరిత్ర, హరిభక్తిసార, తదితర రచనలను కన్నడంలో రచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) ఏ.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణతో నిర్లక్ష్యం వద్దు

### నిండు నూరేళ్ల జీవితాన్ని పోగొట్టుకోవద్దు వన్ ట్రాఫిక్ ఎస్ ఐ పి ఓంకార్



**విజయవాడ పశ్చిమ నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హెల్మెట్ ధారణతో నిర్లక్ష్యం వద్దని నిండు నూరేళ్ల జీవితాన్ని పోగొట్టుకోవద్దని వన్ ట్రాఫిక్ ఎస్ ఐ పి ఓంకార్ ద్విచక్ర వాహనాల చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శనివారం సాయంత్రం కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ లో ట్రాఫిక్ ఏ సి పి రామచంద్రరావు అదేశాలు మేరకు ట్రాఫిక్ సి ఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుంటే..., డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే... ఇన్సూరెన్స్ లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు. ఐతే తామేదో మిమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నామనే అపోహాలు వద్దని రోడ్డు ప్రమాదంలో ఎవ్వరూ మృతి చెందకుండా హెల్మెట్ ధారణ అలవాటు చేయడానికే ఇలాంటి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్ ఐ తన కౌన్సెలింగ్ లో విడమర్చి చెప్పారు. అందరూ క్షేమంగా ఇళ్ళకు చేరాలని ఆయన ఆకాంక్షించారు.

## ద్విచక్ర వాహనాల చోదకులరా... తస్మాత్ జాగ్రత్ర...

### .ట్రాఫిక్ పోలీసులు మళ్ళీ విజృంభిస్తున్నారు.



**విజయవాడ పశ్చిమ నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ద్విచక్ర వాహనాల చోదకులరా తస్మాత్ జాగ్రత్త..... ట్రాఫిక్ పోలీసులు మళ్ళీ విజృంభిస్తున్నారు. ఎన్టీఆర్ డిస్టిక్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఉత్తర్వుల మేరకు, ట్రాఫిక్ డిసిపి శ్రీమతి షేక్ షరీన్ బేగం ఆదేశాల మేరకు, వన్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్ర రావు సూచన ప్రకారం వన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనేశ్వర ఆలయం దగ్గర ""నో హెల్మెట్ నో ఎంట్రీ""అనే నినాదంతో హెల్మెట్ ధరించని వాహనదారులను బ్యారేజ్ వైపు అనుమతించకుండా ఆపి, వాహనదారులకు కౌన్సిల్ నిర్వహిస్తున్నారు. అంతటితో ఆగకుండా శనివారం చలనాలు విధించారు గతంలో కూడా "నో హెల్మెట్ నో ఎంట్రీ" నినాదంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వారి యొక్క విలువైన ప్రాణాలను కాపాడుకొని, వారి కుటుంబాలకు దూరం కాకుండా అండగా ఉండాలని వాహదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో నిర్వహించిన నో హెల్మెట్ నో ఎంట్రీ కార్యక్రమం సత్ఫలితాలు ఇచ్చినందున మరొకసారి ఈ నినాదంతో స్పెషల్ డ్రైవ్న నిర్వహించారు. కార్యక్రమంలో వన్ ట్రాఫిక్ సిఐ ఏ ఉమామహేశ్వర , ఎస్సై శ్రీధర్ , ఓంకార్ , హెడ్ కానిస్టేబుల్ తిరుపతయ్య, కానిస్టేబుల్ ఢిల్లీ శ్రీను, మౌలా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కైకలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బొడ్డు నోబుల్ జన్మదిన వేడుకలు.



**కైకలూరు, నవంబర్ 8 (వార్తా ప్రభ)**కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బొడ్డు నోబుల్ జన్మదిన వేడుకలు ఈరోజు ఘనంగా నిర్వహించబడ్డాయి. కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో వారి స్వగృహంలోస్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు పార్టీ నాయకులు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నోబుల్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బొడ్డు నోబుల్ కైకలూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ముందుంటారని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అభిమానులు మధ్య బొడ్డు నోబుల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు బొడ్డు నోబుల్ అభిమానులు బొడ్డు నోబుల్ కు పూల గుచ్చాలతో, దండలతో, సాల్వలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, మహిళా కార్యకర్తలు, బొడ్డు నోబుల్ అభిమానులు పాల్గొన్నారు.

# పేద బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తాం.

## బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పి. వి. ఫణి కుమార్.



**మచిలీపట్నం** నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)వైసీపీ పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యమైందని, బ్రాహ్మణ కార్పొరేషన్ కు పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తామని, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం శనివారం పి. వి. ఫణి కుమార్ మీడియాతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో బ్రాహ్మణులను విస్మరించారని మండిపడ్డారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు అయిన స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి వైసిపి నాయకులు అడ్డు తగిలిన విధానాన్ని ఎవరు మర్చిపోలేరన్నారు. బ్రాహ్మణులకు ఇవ్వవలసిన సముచిత స్థానం వైసీపీ నాయకులు విస్మరించారు అన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి నిరుపేద బ్రాహ్మణులను ఆదుకున్నారు అన్నారు. అప్పట్లో చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్ కు 500 కోట్లు మంజూరు చేశారు అన్నారు. పేద బ్రాహ్మణులకు అప్పట్లో కార్లు కొనుక్కునేందుకు 50 శాతం సబ్సిడీ చంద్రబాబు ఇచ్చారన్నారు. విదేశీ విద్యకు 10 లక్షల రూపాయలు ఇవ్వటం కూడా జరిగింది అన్నారు. వేద విద్యను ప్రోత్సహించే విధంగా చంద్రబాబు కృషి చేశారన్నారు. బ్రాహ్మణులకు ప్రత్యేక క్రెడిట్ సొసైటీని ఏర్పాటుచేసి రుణాలు తక్కువ వడ్డీతో ఇచ్చారన్నారు. తిరిగి మరలా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తాము అన్నారు. అడిగిన ప్రతి ఒక్క బ్రాహ్మణుడికి బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. త్వరలోనే మృతి చెందిన నిరుపేద బ్రాహ్మణులకు మట్టి ఖర్చులు అందిస్తామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా తనకోసం వచ్చిన ఆర్టీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, కొనకళ్ళ నారాయణరావు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, ప్రముఖ ఎన్నారై, గొర్రె పాటి శ్రీనివాస్ చందుకు ప్రత్యేక కృతజ్ఞతలు ఫణి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్, చోడవరపు లక్ష్మీ ప్రసున్న, బ్రాహ్మణ సంఘం నాయకులు, మోపర్తి సుబ్రమణ్యం, నందూరి సదాశివరావు, జొన్నలగడ్డ మాధవి, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, తంగిరాల మిధున వ్యాస్, వడ్లమన్నాటి మారుతీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాచపట్నం వైఎస్ఆర్సీపీ నేతను పరామర్శించిన జిల్లా అధ్యక్షుడు డిఎన్ఆర్.



**కైకలూరు నవంబర్ 8 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, కైకలూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు ఈరోజు సాయంత్రం కైకలూరు మండలం రాచపట్నం గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు యలవర్తి రామ్మోహన్ రావు కి ఇటీవల శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలుసుకుని, వారి స్వగృహమునకు వెళ్లి వారిని పరామర్శించారు. వీరితోపాటు వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి ఎండి. గాలిబ్ బాబు,కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాంబాబు(రాము), రాచపట్నం గ్రామ సర్పంచ్ అల్లూరి మంగారావు, రాచపట్నం ఎంపీటీసీ సభ్యులు ఈదా కృష్ణవేణి, లక్ష్మణ్,కైకలూరు టౌన్ పార్టీ అధ్యక్షులు సమయం రామాంజనేయులు(అంజి), నియోజకవర్గ సోషల్ మీడియా విభాగ అధ్యక్షులు మండ నవీన్,జిల్లా పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి ఈదా మురళీకృష్ణ, జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి బండి ప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ విభాగ ఉపాధ్యక్షులు సాదు కొండయ్య ,జిల్లా మేధావుల విభాగ ప్రధాన కార్యదర్శి పంజా రామారావు, కైకలూరు మండల పార్టీ ట్రెజరర్ కరేటి రాంబాబు, కైకలూరు మండల బీసీ సెల్ విభాగ అధ్యక్షులు మారగాన్ని రంగారావు(బద్రి), ముదినేపల్లి మండల సోషల్ మీడియా విభాగ అధ్యక్షులు శొంఠి రాము(చిన్న)పరామర్శించిన వారిలో ఉన్నారు.


## రేణిగుంట పనులకు వెళ్లి కరెంటు షాక్ తో కోడూరు యువకుడు మృతి

**ఈ నెల రెండో తేదీ పుట్టినరోజు... అంత లోనే మృతి .**



**కోడూరు, నవంబర్ 8 (వార్త ప్రభ) :** వ్యవసాయ పనుల నిమిత్తం చిత్తూరు జిల్లా రేణిగుంట వెళ్లి కోడూరు మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన యువకుడు విద్యుత్ షాక్ తో మృతి చెందాడు గొల్లపాలెం గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు వ్యవసాయపనులు నిమిత్తం రేణిగుంట వెళ్లారు.వీరి లో ఓలేటి ఇంద్ర బాబు అనే యువకుడు కూడా వారి కుటుంబ సభ్యుల తో కలిసి పనులకు వెళ్ళాడు. అయితే రెండు రోజుల కిందట పొలంలో పని చేస్తూ ఉండగా కరెంట్ షాక్ తో ఇంద్ర బాబు చనిపోయాడు. అక్కడే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శనివారం ఉదయం గొల్లపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. యువకుడికి ఇంకా పెళ్లి కూడా కాలేదు. చేతికొచ్చిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామం లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## శ్రీ వేంకటేశ్వరునికి మొక్కుబడుల చెల్లింపు...



**గుడ్లవల్లేరు:నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డోకిపర్రు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో విచ్చేసిన భక్తులతో శనివారం స్వామివారి సన్నిధిలో తాకిడి అధికమైంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు వేలాది మందికి అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ధర్మకర్తలు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

# చట్టసభలల్లో బి. సి.లు ఉద్యమించాలి.

**● బి.సి. నేషనల్ ఫ్రెంట్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులేష్ యాదవ్.● మెజార్టీ జనాభా వున్న బిసిలు ఇంకా ఓటరలుగానే వుండాలి...● బిసిలఆర్థిక, సామాజిక అభివృద్ధి జరగాలంటే రాజకీయంగా బలపడితేనే సాధ్యం...● జనాభాలో సగ భాగం బీసీలు వున్నా కటిక దరిద్రంలో ఎంతమందో... ● బిసిల కులగణన జరపాలని డి. యం. ఓబులేసు యాదవ్ డిమాండ్... ● "కడప ప్రెస్ క్లబ్ లో బిసి యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బిసిల రాజకీయ చైతన్య సభ...● బిసిల రాజకీయ హక్కులకోసం మాట్లాడిన పలువురు వక్తలు....**



(సి.రాజా రెడ్డి)




దేశ జనాభాలో సగభాగంగా వున్నా బిసిలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే రాజకీయంగా చట్ట సభల్లో ప్రాధాన్యత ఉంటేనే సాధ్యం అని దానికోసం బిసిలందరు క్రియాశీలక ఉద్యమాలకు సిద్ధం కావాలని రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కడపలోని ప్రెస్ క్లబ్ లో బిసిల రాజకీయ చైతన్య సభ, బిసి నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు బిసి నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ అధ్యక్షత వహించగా వక్తలు మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికి పైగా వున్న బీసీలు రాజకీయంగా అత్యంత దారుణంగా వెనుకబడి వున్నారని, దాని కారణంగానే ఇప్పటికి బీసీలు ఆర్థికంగాను, సామాజికంగాను వెనుకబడి వున్నారన్నారు. చట్ట సభల్లో బిసి ల ప్రాధాన్యత ఉంటే, మన అభివృద్ధి కోసం అవసరమైన చట్టాలు చేసేందుకు ఆస్కారం వుంటుందన్నారు. బిసిలల్లో సరైన రాజకీయ చైతన్యం లేక వెనుకబడిన వర్గాలుగా మిగిలిపోతున్నామని, దశబ్దాలుగా బిసిల అభివృద్ధికి తమ ప్రభుత్వాలు, పార్టీలు కృషి చేస్తున్నాయని ఒట్టి మాటలు చెప్పడం తప్పా నిజంగా బిసిలా అభివృద్ధికి చేసింది ఏమి లేదన్నారు. దేశవ్యాప్తంగా రాజకీయాలల్లో 10 శాతంగా వుంటూ అగ్రకులలుగా చాలామని అయ్యే వారి చుట్టే రాజకీయాలు ఉండేట్లు చూసుకుంటూ, దేశంలోని పెద్ద పెద్ద వ్యాపారాలు, కాంట్రాక్టులు, ప్రాజెక్ట్ లు ఇలా దేశ ఆర్థిక వ్యవస్థ అంత వాల్ల చేతిలో పెట్టుకొని 10 శాతంగా వున్నా వాళ్ళే 90 శతంగా వున్నా మిగతా వారిని పాలిస్తున్నారన్నారు. బీసీలు ఇప్పటికి సరైన విద్య, వైద్యం జీవనోపాధి లేక దారుణ స్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగలల్లో కూడా బీసీలు ఉన్నత స్థాయికి వెళ్లే స్థితి లేదన్నారు. అర కోర ఉద్యాగాలు చేసుకుంటూ వున్నారని, కేంద్ర, రాష్ట్రలల్లో ఉన్నతస్థాయి ఉద్యాగలాల్లో అత్యల్పనంగా బీసీలు ఉన్నారన్నారు. దీనికి కారణం రాజకీయ చైతన్యమే ప్రధాన కారణం అన్నారు. బీసీలు రాజకీయం చైతన్యం కలిగి వుండీ చట్ట సభలల్లో ప్రధాన్యం ఉండడం వలన జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, వ్యాపారా రంగాలల్లో బిసి లకు న్యాయం జరిగేటట్లు చట్టాలు అవుతాయాన్నారు. బిసి లందరు చైతన్య వంతులయ్యి దేశంలో కులగన జరిగేందుకు ఉద్యమించాలని, రాజ్యాంగం బద్ధంగా బిసి లకు విద్య, ఉద్యోగాలల్లో సమాన రిజర్వేషన్స్ కల్పించాలని ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అవ్వారు మల్లికార్జున,, కారు ఆంజనేయులు, రమణ, సంగటి మనోహర్, చంద్రమౌళి, ప్రసాద్, కైపు రామాంజనేయులు,పట్టుపోగుల పవన్ కుమార్, దేవర కృష్ణ,లంభోధర, ప్రతాప్ రెడ్డి, మనోజ్ కుమార్, విజయ్ యాదవ్, శ్రీనివాసులు యాదవ్, నాగేశ్వరావు, మల్లేష్, మల్లికార్జున యాదవ్, డాక్టర్ సుబ్బారాయుడు, శివ, జగన్ నాయక్, లాయర్ రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# వేల్పుచర్ల గ్రామానికి మంత్రి వరాల జల్లు

**● సుమారు, సొంత నగదు రూ.60వేలతో విద్యుత్ స్తంభాలు ● కోదండ రామునికి ప్రతీ నెల సొంత నగదు రూ.5వేలు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ● రూ 70 లక్షలతో కొర్లగుంట, వేల్పుచర్ల గ్రామంలో సిసి రహదారులకు శంకుస్థాపనలు. ● ఆర్, సి, ఎమ్.చర్చి కి టైల్స్ అందిస్తా ● రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...**



**నూజివీడు/ముసునూరు, నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ముసునూరు మండలం కొర్లగుంట,వేల్పుచర్ల గ్రామంలో సుడిగాలి పర్యటన చేసిన మంత్రి కొలుసు పార్థసారథి.ప్రజాదర్బార్ నిర్వహించి వరాల జల్లు కురిపించారు.ఎస్, సి. కాలనీలో సుమారు, రూ.7లక్షలతో డ్రైనేజి మరియు సి, సి, రోడ్లు మంజూరు చేశారు. అంతేగాక దీర్ఘకాలికంగా ఎదురు చూస్తున్న పట్టా స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తూ ఇంటి కట్టుబడి కి రుణాలు అందించాలని అధికారులకు ఆదేశించిన మంత్రి. ఇలా అర్ధరాత్రి వరకూ సాగిన పర్యటనలో అందరి కష్టాలు మనవి విని వరాల జల్లు కురిపించిన మంత్రి పట్ల గ్రామ ప్రజలంతా తమ ఆనందాన్ని హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.రూ 70 లక్షలతో సిసి రహదారులకు, కొర్లగుంట రూ 2.30 లక్షలు, మినీగోకులం అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టారు.అనంతరం ప్రజా దర్బార్ లో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఏడాదిన్నర పాలనలోనే ఎన్నో విజయాలు సాధించామని, రానున్న రోజులు అన్ని మంచి రోజులేనని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు ప్రజలు మనోభావాలు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం లో రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు బ్యాలెన్సుగా ముందుకు సాగుతూ దేశంలో ఏక్కడ లేనివిధంగా పెద్దమొత్తంలో పెన్షన్లు ఇస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నాక్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం రూ 15 లకే మూడుపూటలూ కడుపునిండా భోజనం పెట్టి నిరుపేదలు ఆకలి తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తల్లికి వందనం అమలు చేసి, కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి రూ 15వేల, పింఛను రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పింఛను, శాశ్వతంగా మంచాన పడ్డ బాధితులకు రూ.15వేలు అందిస్తూ దేశంలో నే నెంబర్ 1 గా నిలిచిన రాష్ట్రం ఆంధ్రరాష్ట్రం అన్నారు. డిఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయుల పోస్టులను నియమించామని అన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20వేలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి.యల్.సుందరి, తహశీల్దారు డి.ప్రశాంతి, యంపిడివో పి.ఏసుబాబు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యధికంగా దేవస్థానాలకు వెల్లువెత్తిన విరాళాలు...



**గుడ్లవల్లేరు:నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు పలువురు దాతల నుంచి విరాళాలు ఆదివారం అత్యధికంగా వెల్లువెత్తాయి. కొసరాజు శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి సతీమణి, మాజీ ఎంపీపీ కొసరాజు విజయభారతి రూ.10,232, ఆరెకపూడి లక్ష్మి నారాయణ హరీష్ చౌదరి రూ.5,116, పరుచూరి శ్రీరఘు, తేజస్వి(కత్తార్)లు రూ.10,116, పరుచూరి అరవింద్, రమ్యశ్రీ రూ.10,116, ఎర్నేని వసంత లక్ష్మి(యూఎస్ఏ) రూ.5,116, మేరుగు పెరుమాళ్ళరావు రూ.5,116, వెలగపూడి హరేంద్రబాబు, భానుమతి రూ.20వేలు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరి రూ.65వేలు, కోడె వెంకటేశ్వరరావు రూ.10వేలు, ఎనిగళ్ల సత్యనారాయణరావు రూ.10,116, చాపరాల గోపాలకష్ణారావు జ్ఞాపకార్థం రూ.5,116, అల్లూరి సత్యనారాయణ(చంటి) రూ.5,058, బొర్రా శ్రీనివాసరావు రూ.5వేలు, అడుసుమిల్లి బసవేశ్వరరావు, వజ్రమ్మ జ్ఞాపకార్థం కుమారులు రూ.10,125, అడుసుమిల్లి రామమోహనరావు జ్ఞాపకార్థం వారి భార్య స్మృతి సుధా రూ.10,125, అడుసుమిల్లి ఈశ్వరరావు, బాలకోటేశ్వరి కుమారులు శ్రవణ్ కుమార్, కళ్యాణ చక్రవర్తి రూ.10,125, అడుసుమిల్లి వీరయ్య చౌదరి, కౌసల్యా దేవి దంపతుల కుమారులు ఆదిత్య, హక్షిత్‌లు రూ.10,125, ఎమ్ఎల్వీఎస్ కుటుంబరావు(గుడివాడ) రూ.5వేలు, తాటాకుల అంకినీడు రూ.5,116, సూరపనేని రత్న కుమారి రూ.12,001, వడ్లమూడి విజయలక్ష్మి రూ.5వేలు, కేవీఆర్(గుడివాడ) రూ.5వేల విరాళాల్ని అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్లు వల్లభనేని కష్ణప్రసాద్(నాని), పోలవరపు వెంకట్రావు, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి, కోగంటి రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడే నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**కనిగిరి నవంబర్ 8** వార్త ప్రభ ప్రతినిధి కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మండపం నందు ఆదివారం డాక్టర్ పి ఎల్ రావు వారి మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ నెల్లూరు వారిచే, కీర్తిశేషులు పాబోలు వెంకటేశ్వర్లు, డాక్టర్ పాబోలు లక్ష్మణరావు, పాబోలు శేషగిరిరావు ల జ్ఞాపకార్థం పాబోలు రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో డయాబెటిస్ సంబంధిత కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. కంటి చూపు పరీక్ష, కంటి ఒత్తిడి పరీక్ష, కంటి వైద్యుని ద్వారా కంటినరం పరీక్ష, ఉచిత షుగర్, బీపీ పరీక్ష, ఉచిత డయాబెటిక్ వైద్యుని సంప్రదింపు ఈ క్యాంపులో కంటినరం సమస్య గుర్తించిన వారికి మోడరన్ ఐ హాస్పిటల్ నెల్లూరు వద్ద కన్సల్టేషన్, రెటినల్ ఇన్విస్టిగేషన్స్, రెటినల్ లేసర్, రెటినల్ సర్జరీ 25% రాయితీతో నిర్వహిస్తారని పాబోలు రమేష్ కుమార్ (పాబోలు జ్యూయలర్స్) తెలిపారు.

## భక్త కనకదాసుకు నివాళులర్పించిన జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు.



**మచిలీపట్నం నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శనివారం భక్త కనకదాసు జయంతి సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఆర్ఓ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురుబ గౌడ దాస సమాజానికి ఆరాధ్య ధైవంగా నిలిచిన భక్త కనకదాసు కర్ణాటకలోని గొప్ప భక్తుడు, ఆధునిక కవి, యోధుడు అని, నలచరిత్ర, హరిభక్తిసార, మోహన తరంగణి, రామ ధ్యాన చరిత్రే వంటి రచనలు చేసి సాహిత్యంతో సామాజిక విప్లవం సాధించవచ్చని నిరూపించిన మహానుభావుడు అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారి జి రమేష్, నగర మున్సిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు, జిల్లా వ్యవసాయ శాఖ ఏడి మణిధర్, పలువురు కలెక్టరేట్ ఉద్యోగులు, కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కామేశ్వరరావు గృహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న దారపనేని



**కనిగిరి నవంబర్ 8 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో దారపనేని కామేశ్వరరావు నూతనంగా గృహ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి, దారపనేని కామేశ్వరరావు కు అభినందనలు తెలిపారు. గృహ నిర్మాణం లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, మేస్త్రి దేవరకొండ చెన్నకేశవులు కు సూచించారు. ఈ కార్యక్రమంలో పూజారి కృష్ణయ్య, మేస్త్రి దేవరకొండ చెన్నకేశవులు, కామేశ్వర రావు కుమారులు హరికృష్ణ, సాయి కృష్ణ పాల్గొన్నారు.

## అద్దంకి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దారపనేని



**కనిగిరి నవంబర్ 8 వార్త ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామ వాస్తవ్యులు అద్దంకి నాగమల్లేశ్వరరావు, శ్రీమతి వైదేహి దంపతుల కుమారుడు చిరంజీవి నాగరాజు, నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం సోమల రేగడ గ్రామ వాస్తవ్యులు మన్నేపల్లి శ్రీనివాసులు శ్రీమతి లక్ష్మీదేవి దంపతుల కుమార్తె లావణ్య ల వివాహ వేడుకలు శనివారం తెల్లవారుజాము 3 గంటల 29 నిమిషాలకు పోతవరం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని నాగరాజు దంపతులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కల గండి రిజర్వాయర్ మాజీ చైర్మన్ అద్దంకి మాల్యాద్రి, అద్దంకి నాగయ్య, అద్దంకి మల్లికార్జునరావు, మాల్యాద్రి, ప్రకాష్ రావు, కొండలరావు, ఇండ్ల చెరువు వెంకటేష్, అద్దంకి వారి కుటుంబ సభ్యులు, మన్నేపల్లి వారి కుటుంబ సభ్యులు, ఇండ్ల చెరువు వారి కుటుంబ సభ్యులు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## సందడిగా వన సమారాధన....



**గుడ్లవల్లేరు:నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచాయితీరాజ్ ఉద్యోగులు శనివారం కార్తీక వన సమారాధనను చేపట్టారు. ఈ వన సమారాధనలో ఉద్యోగులు తమ కుటుంబాలతో కలిసి పాల్గొనేసరికి సందడి వాతావరణం నెలకొంది. ఆటవిడుపుగా ఉద్యోగులు తమ కుటుంబాలతో ఆట పాటల్లో ఉల్లాసంగా...ఉత్సాహంగా పాల్గొన్నారు.

# హరిహరసుతునికి అష్టాదశ అభిషేకాలు.

## శరణుఘోషతో హోరెత్తిన ఆర్కే కన్వెన్షన్ ఆవరణ.







**చల్లపల్లి: అవనిగడ్డ: నవంబర్ 8 (వార్తాప్రభ ప్రతినిధి)** జ్యోతి స్వరూపుడు,హరిహరసుతుడు శ్రీ అయ్యప్ప స్వామివారికి అష్టాదశ అభిషేకాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.చల్లపల్లి మండలం మేకావారిపాలెంలోని ఆర్కే కన్వెన్షన్ ఆవరణ వేదికగా ఆర్కే కన్వెన్షన్ అధినేత,రావెళ్ళ కృష్ణ సేవా సమితి చైర్మన్ రావెళ్ళ ఉదయ్ కుమార్ గురుస్వామి తన 18వ శబరిమల యాత్ర సందర్భంగా శనివారం స్వామి వారి 18 మెట్ల కలశపూజ, మహా పడిపూజ, స్వామివారి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసిన విషయం పాఠకులకు విదితమే.మధు నంబూద్రి గురుస్వామి అర్చక పర్యవేక్షణలో ఉదయ్ కుమార్ గురుస్వామి దంపతులు వివిధ రకాల పూజాద్రవ్యాలతో అష్టాదశ అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.సినీ సెట్టింగులను తలపించేవిధంగా మూడు అంతస్తులుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మందిరంలో దేవతామూర్తుల విగ్రహాలను ఆశీనులు చేసి ఉదయం నుంచి పూజాది కార్యక్రమాలు కొనసాగించారు.స్వామివారి విశేష పూజాకార్యక్రమాలకు వేదికైన ఆర్కే కన్వెన్షన్ ఆవరణ పూర్తి ఆద్యాత్మిక శోభను సంతరించుకుంది.అధిక సంఖ్యలో హాజరైన భక్తుల శరణుఘోషతో ఈ ప్రాంతం దద్దరిల్లింది.నభూతో నభవిష్యతి అన్న రీతిలో ఏర్పాటు చేసిన పూజా మందిరానికి చేసిన విద్యుత్ దీపాలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**బుద్ధప్రసాద్ సహ పలువురు ప్రముఖుల హాజరు.** ఆర్కే కన్వెన్షన్ వేదికగా అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్న స్వామి వారి మహా పడిపూజ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా , యువనేత మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

## ఎన్నికల తర్వాత ఏర్పాటు చేస్తామన్న మంత్రి పొంగులేటి

## పొంగులేటి సమక్షంలో బిజెపి, బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరిక



**హైదరాబాద్ నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సమీకృత గురుకుల పాఠశాలల(ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) పథకంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఒక పాఠశాలను మంజూరు చేస్తామనిరాష్ట్ర రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, రెహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రెహమత్ నగర్ డివిజన్ కార్మికనగర్‌లో శనివారం సాయింత్రం జరిగిన కార్యక్రమంలో రెహమత్ నగర్ డివిజన్ భారతీయ జనతా యువమోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బిఆర్ఎస్ డివిజన్ సెక్రెటరీ ఇబ్రహీం వందలాది మంది తమ అనుచరులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ కండువాలు కప్పి వీరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కులం లేదా వర్గ విభజనలకు అతీతంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొత్త రెసిడెన్షియల్ పాఠశాలను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు.రూ.200 కోట్ల రూపాయిలు ఖర్చయ్యే ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉంటాయి, ఇవి సాధారణంగా 20-25 ఎకరాల విస్తీర్ణంలో ఉంటాయని ఇప్పటికే రాష్ట్రంలో 78 పాఠశాలలకు ఆమోదం లభించిందని ఆయన తెలిపారు. తాజాగా పేదలు, అన్నివర్గాల ప్రజలు అధికంగా ఉండే ఈ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల తర్వాత కనీసం 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమీకృత గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను ఈ పాఠశాలలు అందిస్తాయని ఆయన తెలిపారు.పేరుకు మాత్రమే జూబ్లీహిల్స్ నియోజకవర్గం పేరు ఉందని వాస్తవానికి ఈ నియోజకవర్గంలో పేదలు, నిరుపేదలే ఎక్కువ శాతం లో ఉన్నారని వీరి బాగోగులను గత ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని విద్య, వైద్యం గురించి ఆలోచన కూడా చేయలేదని మంత్రి పొంగులేటి అన్నారు. కేవలం ఒక్కరోజు మాత్రమే ప్రచారాలకు మిగిలిఉందని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, యువరక్తం పనితీరు ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పాలని సూచించారు. గత ప్రభుత్వం 8.19లక్షల కోట్ల రూపాయిలను అప్పుగా ఇచ్చిందని అయినప్పటికీ ఇందిరమ్మ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆపలేదని అన్నారు. ప్రజల కష్టాన్ని దోచిన బిఆర్ఎస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. 16 లక్షల రేషన్ కార్డులు, 14 లక్షల మంది పేర్లను కొత్తగా చేర్చడం, 62 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడం తమ ప్రభుత్వ విజయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కేసీఆర్‌తో పాటు లక్షకోట్ల అవినీతికి పాల్పడిన హరీష్‌రావు మళ్లీ పాడిందే పాటరా.. అన్నట్లు పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని పొంగులేటి దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయానికి రావడం లేదన్న ఆరోపణను తిప్పికొడుతూ గతంలో ఎమ్మెల్యే ఎంపీలకు కూడా సచివాలయంలోకి రానివ్వని బిఆర్ఎస్ వారికి ఇప్పుడేం జరుగుతుందో తెలియడం లేదని, ఇప్పటికైనా మామా అల్లుల్లు ఫాంహౌస్‌లు దాటి రావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు శంకర్‌నాయిక్,బల్మూరి వెంకట్, సిఎన్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తి-సాంస్కృతిక శోభలో యాదవుల వన సమారాధన మహోత్సవం

## గోపూజ, సత్యనారాయణ వ్రతంతో యాదవుల కార్తీక వనభోజనం వైభవంగా

## యాదవుల కార్తీక వన సమారాధన పత్రిక ఆవిష్కరణ



**మంగళగిరి నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మంగళగిరి నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన మహోత్సవం ఈ నెల 16వ తేదీ ఆదివారం మంగళగిరి బైపాస్ రోడ్డులో గల హ్యాపీ రిసార్ట్స్ లో వైభవంగా జరగనుంది.ఈ సందర్భంగా మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం మంగళగిరి బైపాస్‌లోని వైటీఆర్ ట్రస్ట్ ఆవరణలో యాదవ సంఘ నాయకులు ఆవిష్కరించారు.యాదవ సంఘ నాయకులు మాట్లాడుతూ, కార్యక్రమం ఉదయం 8 గంటలకు గోపూజతో ప్రారంభమై, అనంతరం వందమంది దంపతులతో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్య ప్రదర్శనలు,పిల్లలు,పెద్దల కోసం ఆటల-పాటల పోటీలునిర్వహించనున్నామని వివరించారు.మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు భోజన విందు అనంతరం ప్రముఖ యాంకర్ ఆధ్వర్యంలో పాటల-డాన్స్ పోటీలుజరుగుతాయని,విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.రాష్ట్రం నలుమూలల నుండి యాదవ కుల పెద్దలు, ప్రముఖులు హాజరై ఆశీర్వచనాలు అందజేయనున్నారని, సాయంత్రం సహకరించిన దాతలతో పాటు పెద్దలకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తుల్లిమిల్లి రామకృష్ణ, తోట పార్థసారథి, ఎర్రకుల తులసీరామ్,తోట శివరాం, కుర్ర శ్రీనివాసరావు, దానబోయిన శివశంకరరావు, పేరుబోయిన వెంకటేశ్వరరావు, రుద్రు శ్రీనివాసరావు, తోట సాంబశివరావు, చింకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన నేపథ్యంలో బాగంగా నగర పోలీసుల వినూత్న కార్యక్రమాలు

## హెల్మెట్ ధరించిన వాహనదారులకు అభినందనలు తెలిపిన ట్రాఫిక్ డి.సి.పి.శ్రీమతి షిరీన్ బేగం







**విజయవాడ పశ్చిమ నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.యస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డి.సి.పి. శ్రీమతి షిరీన్ బేగం పర్యవేక్షణలో నగరంలోని ముఖ్య జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నియమ నిభందనలు, హెల్మెట్ ధరించడం వలన కలుగు ఉపయోగాలపై అవగాహనా కార్యక్రమము చేపట్టారు. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు హెల్మెట్ ధరించి బైకులను నడిపిన వారిని, సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులను, యూనిఫాం ధరించిన ఆటో డ్రైవర్లను, మోటారు వాహన చట్టాలను గౌరవించిన వాహన దారులను అభినందిస్తూ రోజా పూలను అందించడం జరిగింది.ఈ క్రమంలో వాహనదారులు ఇతర వాహనదారులకు అవగాహన కల్పించే విధంగా వారిని ప్రోత్సహిస్తూ అభినందించారు.ఈ సందర్భంగా డి.సి.పి. మాట్లాడుతూ.... .వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ముందుగా చట్టాన్ని గౌరవిస్తూ, ప్రాణానికి విలువనిస్తూ సమాజానికి ఆదర్శంగా హెల్మెట్ ధరించిన మరియు చట్టాలను గౌరవించిన వాహనదారులను అభినందిచారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదములను నివారించుటకు సమాజంలో ప్రతి పౌరుడు తప్పనిసరిగా చట్టాలను గౌరవిచాలని, ప్రతిఒక్కరూ తమతమ గమ్య స్థానములకు సురక్షితంగా వెళ్ళేందుకు రహదారి నియమ నిభందనలకు అనుగుణంగా మోటారు వాహన నిబంధనలను పాటిస్తూ వాహనములను నడపాలని తెలిపారు. స్వీయ భద్రతే కుటుంబ భద్రత అని గుర్తు చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

# తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే మా అజెండా...

## ప్రతి అడుగు భావితరాల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసమే..

## కాంగ్రెస్ ను ఆదరించాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి



**హైదరాబాద్, నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే మా ప్రభుత్వ 'అజెండా' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకే బీఆర్ఎస్, బీజేపీ మాపై 'దుష్ప్రచారం' చేస్తున్నాయన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా శనివారం శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డి గూడలోని పలు కాలనీల్లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ పాలనలో దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు తీసుకున్న చర్యలను ఓటర్లకు వివరించారు. మేం వేసే ప్రతి అడుగు భావితరాల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసమేనని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని, ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురయ్యిందన్నారు. చాలా కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారో నిలదీయాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ... స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న నవీన్ యాదవ్ ను ఇక్కడ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే... ఇక్కడి ప్రజలు, నియోజకవర్గానికి మేలు జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియోజకవర్గం అభివృద్ధికి అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిరంతరం రాష్ట్రాభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కాంగ్రెస్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించి బీఆర్ఎస్, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 11వ తేదీన ఆగిరిపల్లిలో మెగా జాబ్ మేళా -రాష్ట్ర సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి



**నూజివీడు, నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈనెల 11 వతేదీన అగిరిపల్లి లో మెగా జాబ్ మేళా నిర్వహించి 1135 కి పైగా నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆగిరిపల్లిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో ఈనెల 11వ తేదీ మంగళవారం ఉదయం 9 నుండి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 1135 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకుగాను 17 కంపెనీలకు సంబందించిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎస్.సి.సి నుండి ఇంటర్, ఐ. టి. ఐ., డిగ్రీ, బి. ఫార్మసీ, బి.టెక్, తదితర కోర్స్ లు పూర్తిచేసిన వారు ఈ జాబ్ మేళా లో పాల్గొని ఉద్యోగ అవకాశం పొందవచ్చన్నారు. జాబ్ మేళా కు హాజరు అయ్యే అభ్యర్థులు తమ బయోడేటా మరియు సర్టిఫికెట్స్ జిరాక్స్ తో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8374039719, 9491694228 ను (9988853335 టోల్ ఫ్రీ) నెంబర్లను సంప్రదించవచ్చని, నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పార్థసారధి విజ్ఞప్తి చేశారు.

# కళ్యాణదుర్గంలో శ్రీ భక్త కనకదాస జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేష్

## 9 అడుగుల శ్రీ భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరణ

## వేలాది మంది మహిళలు, స్థానిక ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లిన మంత్రి



**కళ్యాణదుర్గం: నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలో సామాజిక తత్వవేత్త, స్వరకర్త, కురుబల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాస 538వ జయంతి ఉత్సవాల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణ, హిందూపురం రోడ్డు, బైపాస్ సర్కిల్ లో స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటుచేసిన 9 అడుగుల కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బైపాస్ సర్కిల్ కు శ్రీ భక్త కనకదాస సర్కిల్ గా నామకరణం చేశారు. అంతకుముందు బైపాస్ సర్కిల్ కు వేలాది మంది మహిళలు, స్థానిక ప్రజలతో కలిసి మంత్రి నారా లోకేష్ ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, ఎస్.సవిత, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీ నారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకట శివుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కందికుంట వెంకట ప్రసాద్, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భక్త కనకదాస వేడుకల్లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు

# కొనసాగుతున్న శ్రీ గంగానమ్మ సంబర మహోత్సవాలు....



**గుడ్లవల్లేరు:నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దశాబ్దాల చరిత్ర కలిగిన గుడ్లవల్లేరు శ్రీ గంగానమ్మ అమ్మవారి సంబర మహోత్సవ వేడుకలను రెండో రోజు శనివారం కూడా వైభవంగా నిర్వహించారు. పోతురాజు గెడ, నాగ పడగలను గ్రామంలోని ప్రధాన వీధుల వెంబడి ఊరేగింపును నిర్వహించారు. భక్తులు ఈ ఊరేగింపుకు బ్రహ్మరధం పట్టారు. దేవస్థాన అభివద్ధి కమిటీకి చెందిన ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశు వుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్లు వల్లభనేని కష్ణప్రసాద్(నాని), పోలవరపు వెంకట్రావు, మురాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై సామాజిక స్పృహ, చైతన్యం కలిగించే కళారూపాలను రూపొందించాలి

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సిపిఐ వందేళ్ల చరిత్రను చాటిచెప్పడంతో పాటు ప్రజాసమస్యలపై సామాజిక స్పృహ, చైతన్యం కలిగించే కళారూపాలను రూపొందించాలని పలువురు సిపిఐ నేతలు అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కళారూపాలు ఉండాలని, సిపిఐ వందేళ్ల చరిత్రను కళాకారుల ఆటలు, పాటలలో ప్రతిబింబించాలన్నారు. అరసం, తెలంగాణ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల వర్క్ షాప్ శనివారం హైదరాబాద్ మఖ్దూంభవన్ రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైంది. వర్క్ షాప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తూ అసాధారణమైన సిపిఐ వందేళ్ల చరిత్రలోని ఆటుపోట్లు, ఒడుదుడుకులను, విజయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మరోవైపు ప్రజల సమస్యలు, బాధలు, ఆవేదనలను కళాకారులు రచయితలు కళారూపాలుగా మలచడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సినీ తదితర రంగాలలో ప్రముఖులు ప్రజానాట్యమండలి, అరసంలో అక్షరాలు దిదినవారేనని గుర్తు చేశారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి కళలే ఊపిరి అని, కళారూపాలలో అనునిత్యం నూతనత్వం ఉండాలని సూచించారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ దేశంలో, సమాజంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులును ఆకలింపు చేసుకుని కళారూపాలను రూపొందించాలన్నారు. డ్రగ్స్, గంజాయ్, మద్యం అంశాలతో పాటు సామాజిక రుగ్మతల నిర్మూళనకు కళాకారులు, రచయితలు తమ వంతు కృషి చేయాలన్నారు. ఒగ్గు కథలు, గేయాలు, నాటికలకు ఇంకా ప్రజలలో ఆదరణ ఉందని, వాటి ద్వారా ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అరసం అధ్యక్షులు పల్లేరు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ తదితరులు ప్రసంగించారు.

# చంద్రబాబుపై జగన్ విష ప్రచారం దుర్మార్గం.....

## అమరావతిలో అభివృద్ధి పరుగులు.....

## కూటమి ప్రభుత్వ ప్రతిష్ట మంట కలిపే ముందుకే జగన్ కుట్ర.....

## రాష్ట్ర వినాశనం - వైసీపీ లక్ష్యం. .

## టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్.....



**అమరావతి నవంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ లు అలుపెరగకుండా విదేశీ పెట్టుబడుల కోసం శ్రమిస్తుంటే వైసీపీ ముఠా మాత్రం తను జగన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతిష్టను ఎలా దిగజార్చాలి, అభివృద్ధిని ఎలా అడ్డుకోవాలని రోజూ కుట్రలు పన్నుతూనే ఉన్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ విమర్శించారు అమరావతి లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యం - డ్రగ్స్ దందా ఒకే రకమైన కుట్ర అని వైసీపీ ముఠాకి మాత్రమే తెలిసిన నీచ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు వైసీపీ ఏకైక లక్ష్యం కూటమి ప్రభుత్వంపై బురద చల్లటం, రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడటం మొన్నే కూటమి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలని ఉద్దేశంతో కుట్రపూరితంగా జగన్ డైరెక్షన్-జోగి యాక్షన్లో నకిలీ మద్యం ఫార్ములా రూపొందించారని ఆయన విమర్శించారు. కల్తీ సారా తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేసి, "కూటమి ప్రభుత్వంలో మద్యం మాఫియా పెరిగిపోయింది" అని దుష్ప్రచారం చేయాలని కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. జోగి రమేష్ అడ్డంగా దొరికిపోయిన తర్వాత కులం అంటూ కుల కార్డుతో రాజకీయాలు మొదలుపెట్టారని ఆయన విమర్శించారు తమ కూటమి ప్రభుత్వం గంజాయిని ఉక్కుపాదంతో అణిచివేస్తుంటే. తాడేపల్లి నుంచి మరో కుట్రకు జగన్ తెరలేపారని ఆయన మండిపడ్డారు రాష్ట్రానికి భారీ పెట్టుబడుల గూగుల్ రాకతో ఏఐ హబ్, యువత కలలు కనే నగరంగా విశాఖ ఎదుగుతుంటే అది చూసి తట్టుకోలేకపోతున్నా జగన్ వైసీపీ ముఠా ఈ నగరాన్ని 'మత్తు' రాజధానిగా మార్చాలని నీచానికి దిగజారిందని. వైసీపీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి ఎల్ ఎస్ డి, ఎం డి ఎం ఏ, గంజాయి సరఫరా చేస్తూ అడ్డంగా ఈగల్ టీంకి చిక్కాడని అడ్డంగా దొరికిపోయిన కొండారెడ్డి జగన్, గుడివాడ అమర్నాథ్ రెడ్డితో రాజకీయ సంబంధాలుంటేనే ఈ చీకటి వ్యాపారం వెనుక ఎంత పెద్ద రాజకీయ అండదండలు ఉండేవో అర్థం చేసుకోవచ్చునని యువతకు మార్గనిర్దేశం చేయాల్సిన పార్టీ పదవిలో ఉండి, యువతనే లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ దందాకు తెరతీశారంటే, వైసీపీ రాజకీయం ఏ స్థాయిలో దిగజారిందో అర్థమవుతుందని ఆయన విమర్శించారు

# మంచి పారిశ్రామికవేత్తను కోల్పోవడం బాధాకరం : శాసనసభ్యులు యార్లగడ్డ



**గన్నవరం,నవంబర్ 8 (వార్తాప్రభ) :** విలువలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న మంచి పారిశ్రామికవేత్త ముక్కామల సురేంద్రబాబు ఆకస్మిక మరణం బాధాకరమని ఆయన లేని లోటు పారిశ్రామిక రంగానికి తెలుగుదేశం పార్టీకి తీర్చలేనిదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన సురేంద్రబాబు సంస్మరణ సభ శనివారం ఉదయం గన్నవరంలోని ఏపీ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వెంకట్రావ్ సురేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసంగిస్తూ కుగ్రామం నుంచి వచ్చి పారిశ్రామిక రంగంలో చెరగని ముద్ర వేసిన సురేంద్రబాబు చిరస్మరణీయుడు అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దూరంగా ఉన్న పారిశ్రామికవేత్తలతో సహా అనేకమంది అధికారం వచ్చిన వెంటనే మేము మీ పార్టీ అంటూ అధికార పార్టీవైపు రావడం సహజంగా చూస్తుంటామని కానీ సురేంద్రబాబు 2024 ఎన్నికల్లో తనకు బహిరంగ మద్దతు ప్రకటించి తన విజయం కోసం ఎంతగానో కష్టపడ్డారని గుర్తు చేసుకున్నారు. ఆయనకు ఏదైనా అవసరమైతే ఫోన్లో చెప్పమన్నా చెప్పకుండా నేరుగా వచ్చి కలిసి మాట్లాడటం ఆయన సంస్కారానికి నిదర్శనంగా యార్లగడ్డ పేర్కొన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే సురేంద్రబాబు లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని సురేంద్రబాబు ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కామినేని శ్రీనివాస్ తదితరులు సురేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# శాంతి వృద్ధుల అశ్రమంలో దుప్పట్లు, భోజనం అందించడం అభినందనీయం - ఆర్కె

**గుడివాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** కుంభం పాండురంగారావు జన్మదిన వేడుక సందర్భంగా శాంతి వృద్ధుల ఆశ్రమంలో దుప్పట్లు, పండ్లు, అన్నదానం కార్యక్రమం చేసి మానవత్వాన్ని చాటిన కుంభం కుటుంబ సభ్యులు అభినందనీయులని బిజెపి పట్టణాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కె) అన్నారు. శనివారం స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో కుంభం పాండురంగారావు జన్మదిన వేడుక సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ బిజెపి అధ్యక్షులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్కె) మాట్లాడుతూ పేదవారికి సహాయం చేయడమే నిజమైన దైవ కార్యక్రమము అనే ఆలోచనతో, మనకున్న దానిలో పదిమందికి సహాయం చేయాలని ఆకాంక్షిస్తూ ఆకలితో ఉన్న అన్నార్తులకు ఆహారం అందజేయడమే లక్ష్యంగా సేవ చేస్తునట్లు భవించాలన్నారు. అదే తరహాలో ఎవరిదైనా పుట్టినరోజులు, పెళ్లిరోజులు, వివిధ కార్యక్రమాలను కుటుంబ సభ్యులతో పాటు



ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు సహాయం చేస్తూ, అన్నదానం చేస్తే ఆ భగవంతుని ఆశీస్సులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కుంభం అయ్యప్ప, లంకా రాంబాబు, గాదె చరణ్, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

# నవంబర్ 18 చలో ఢిల్లీ

- అహీర్ రెజిమెంట్ సాధన, చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు తదితర యాదవుల చిరకాల డిమాండ్స్ సాధనకు జంతర్ మంతర్ వద్ద అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో భారీ ధర్నా
- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ మహేశ్వరి యాదవ్ పిలుపు

**తిరుపతి,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ప్రపంచ మానవాళికి సమస్యా పరిష్కారము, దిశానిర్దేశం సూచిస్తున్న భగవద్గీతా సారాన్ని గ్రామ గ్రామల్లో క్లస్టర్ నిర్మాణాలలో వివరిస్తూ, రెజాంగ్లా కలశ యాత్రను, భారత దేశం లోని ప్రతి రాష్ట్రంలో లక్ష కిలో మీటర్ల ప్రయాణం , భగవద్గీతా వివరణతో నా యాదవ సహోదర, సహోదరీమణులెందరో ఉత్సాహవంతంగా పాల్గొన్నారనీ అఖిల భారత యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ మహేశ్వరి యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 సంవత్సరములు పూర్తి చేసుకున్న అఖిల భారత యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ లో 50 నెలల శిక్షణా తరగతులలో పొందిన భగవద్గీతా సత్యజ్ఞానంతో రెండవ శతాబ్దంలోకి అడుగుపెట్టి నవంబర్ 18 న ఢిల్లీలోని జంతర్ మంతర్ లో దేశం నలుమూలలా ఉన్న యాదవులు యాదవ రెజిమెంట్ సాధన,ఓబీసీలకు చట్టసభలలోరాజకీయ రిజర్వేషన్లు ,మహిళా రిజర్వేషన్ బిల్లు ఓబీసీ మహిళలకు సబ్ కోట అనగా 33% మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలనీ, అనగా 33 లో 33, 11% రిజర్వేషన్ కల్పించాలన్నారు.సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి యాదవుడు వెంకటేశ్వర స్వామికి, అనేక భూధానాలు గోదానాలు దీప దూప నైవేద్యాలకే కావలసినటువంటి నిధులను సమకూర్చినది యాదవులే, అనేక



మండపాలను నిర్మాణం చేసినది కూడా యాదవులే, వీర నరసింగదేవ యాదవ రాయలు ,ఇమ్మడి నరసింగ దేవ యాదవ రాయలు, రంగనాథ యాదవ రాయలు, హొూబిల యాదవ రాయలు, యాదవ రంగమ్మ గొల్ల మండపాన్ని నిర్మాణం చేసి తన భక్తిని చాటుకున్నదన్నారు. కావున టీటీడీ చైర్మన్ పదవిని శాశ్వతంగా యాదవులకు మాత్రమే కేటాయించే విధమైనటువంటి ఏర్పాటు చేయాలనీ, కాటమ రాజు బీడు భూములను పసుగ్రాసం కోసం మాత్రమే వినియోగపడే విధంగా , పరిరక్షించాలి అనే డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి , డిమాండ్ల సాధన కోసం రెండవ శతాబ్దంలోకి అడుగిడుతూ , శ్రీ కృష్ణ భగవానుని గీతా సారాన్ని, సత్యజ్ఞానాన్ని గ్రామగ్రామాలలో వ్యాప్తి చేస్తున్న అఖిల భారత మాధవ మహాసభ జోన్ ప్రెసిడెంట్లకు, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లకు శతాబ్ది ఉత్సవ ప్రెసిడెంట్ కు, మహిళా ప్రెసిడెంట్ కు , సెక్రటరీ జనరల్, జనరల్ సెక్రటరీలకు , రెజాంగ్లా కలశ యాత్రను అప్రతిహతముగా జయప్రదం చేసిన యాదవులందరికి శ్రీ కృష్ణ భగవానుని ఆశిస్సులు ఎల్లవేళలా కాపాడుతాయని ఆశిస్తూ , డిల్లీలోని జంతర్ మంతర్ లో నవంబర్ 18 వ తారీకు న ఆందోళన కలిసి విజయవంతం చేద్దామని అధ్యక్షురాలు ఎస్ మహేశ్వరి యాదవ్ పిలుపునిచ్చారు.

# వైయస్ జగన్ గతంలో ఇచ్చిన సంక్షేమ పథకాలనే పేర్లు మార్చి తమదిగా చూపిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం..

- పేదల సంక్షేమాన్ని మసకబార్చే ప్రయత్నం
- వైస్సార్సీపీ ఎస్.సి. విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనమాల శామ్యూల్

**పెనుగంచిప్రోలు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం, రైతు, విద్యార్థి, మహిళ, వృద్ధుడు మరియు కార్మికుడి కోసం ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు.ఆ పథకాల వల్ల ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం అభివృద్ధి వైపు అడుగులు వేసింది.కానీ, ప్రస్తుత ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాము "విజనరీ ప్రభుత్వం" అని చెప్పుకుంటూనే, కొత్తగా ఏ పథకం ప్రవేశపెట్టకపోగా, జగన్మోహన్ రెడ్డి పథకాలకు కేవలం పేర్లు మార్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వైసిపి నేత కనుమాల శ్యామ్యూల్ పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పథకాలైన రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలు గా, రైతు సుఖీభవ ను అన్నదాత సుఖీభవ గా, జగనన్న కాలనీలను ఎన్టీఆర్ నగర్ గా, అమ్మ ఒడి నీ తల్లికి వందనం గా జగనన్న గోరుముద్ద ను మధ్యాహ్న భోజన పథకం గా విద్యా కానుక ను విద్యామిత్ర గా, నాడు-నేడు ను మన బడి మన భవిష్యత్తు గా, మత్స్యకార భరోసా ను మత్స్యకార సేవ గా, వాహన మిత్ర ను ఆటో డ్రైవర్ సేవలు గా, దిశా యాప్ ను శక్తి యాప్ గా ఇప్పుడు గ్రామ/వార్డు సచివాలయాలను విజన్ యూనిట్లు



అని పేర్లు పెట్టడం అని ఆయన వివరించారు. పేర్లు మారినా పథకాల మూలం మాత్రం జగన్మోహన్ రెడ్డి విజన్, పేదల పట్ల ఆయన చూపిన ప్రేమ, సేవా తపన మరియు స్ఫూర్తి నిండిన మహా సంకల్పమే అన్నారు. రాష్ట్రంలో ఉన్న పేదలు, రైతులు, విద్యార్థులు ఇవన్నీ జగనన్న పాలనలో మొదటిసారి తాము పొంది అనుభవించారన్నారు. పథకాలకు పేర్లు మార్చడం ద్వారా ప్రజల జ్ఞాపకాలనూ, ఆ నాయకుడి ప్రజా ఆదరణను మార్చలేరన్నారు. జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచి ఉంటుందనీ, ప్రజా సంక్షేమం అంటే పేర్లు మార్చడం కాదు, ఆ పథకాలను కొనసాగించడం, పేదలకు న్యాయం చేయడం.ప్రస్తుత ప్రభుత్వం పేదల హక్కులను కాపాడే దిశగా కాకుండా,తమ రాజకీయ ప్రయోజనాల దిశగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. జగన్మోహన్ రెడ్డి పేర్లు ప్రజల హృదయాల్లో ఇప్పటికే చెక్కు చదరకుండా ఉన్నాయనీ ,. ప్రస్తుత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పథకాల పేర్లు మార్చడం వల్ల ప్రజల మదిలో వైఎ స్ జగన్మోహన్ రెడ్డి కీర్తి మరింత ఎత్తులో ఉండిపోతుందని పెనుగంచిప్రోలు మండలం లో వైఎస్సార్సీపి ఎస్సి సెల్ జనరల్ సెక్రెటరీ కన్నమాల శామ్యూల్ శనివారం పత్రికా విలేకర్ల కు తెలిపారు...

# గోసంరక్షణ కు 10 వేల 116/ రూపాయలు విరాళం



**పెనుగంచిప్రోలు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వారి గోశాల లో వున్న గోసంరక్షణ కు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఖమ్మం నగరం ఎన్జీవోస్ కాలనీ వాస్తవ్యులు అన్వడి ముఖేష్ రెడ్డి రవళి దంపతులు కుటుంబ సమేతంగా శనివారం శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని గోసంరక్షణకు 10,116/ రూపాయలు విరాళముగా ఆలయ అధికారులకు అందజేశారు. వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

# వైభంగా శ్రీలక్ష్మీ గణపతి హెూమం



**గుడివాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర దేవాలయంలో సంకటహర చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవస్థాన మండపంలో శనివారం శ్రీ లక్ష్మీ గణపతి హెూమ పూజలు 130 మంది దంపతుల జంటలు పీటలపై కూర్చొని పూజలు చేశారు. శ్రీ సంకటహర చతుర్దశి పర్వదినం, పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని లోక కళ్యాణార్థం దేవాలయంలో లక్ష్మీ గణపతి హెూమ పూజలు నిర్వహించినట్లు దేవస్థానం ఈవో యార్లగడ్డ వాసు తెలిపారు తెలిపారు. హెూమ పూజల్లో దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# భక్త కనకదాస జీవితం ఆదర్శనీయం - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** తత్వజ్ఞానాన్ని పామరులకు అర్థమయ్యేలా సంగీత సాహిత్యాలతో రచనలు చేసిన ప్రముఖ తత్వవేత్త సంగీతకారుడు స్వరకర్త భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శదాయకమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. భక్త కనకదాస 538వ జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కనకదాస జయంతి వేడుకులకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ హాజరై కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామధ్యాన చరిత్ర, మోహన తరంగిణి వంటి ప్రధాన రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయాని కనకదాస జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. 20 సూత్రాల పథకం చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ సమాజంలో కుల వివక్షను రూపుమాపడంలో కనకదాస రచనలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆయన జయంతిని పరస్కరించుకుని రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని



ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. డిఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, జిల్లా బిసీ సంక్షేమ అధికారిణి డి. లక్ష్మీదేవి, డివిజనల్ సంక్షేమ అధికారులు ఆర్. రవిప్రసాదరావు, పి. శ్రీనివాసరావు, వార్డెన్లు ఎం. రజని, విజయదుర్గ, మేరి జాన్సన్, సూపరింటెండ్ పి. రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ కాంపిటేషన్లో సత్తా చాటిన కానుమోలు విద్యార్థులు



**హనుమాన్ జంక్షన్,నవంబర్ 8 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నవంబరు 7న మచిలీపట్నంలో జరిగిన స్కిల్ కాంపిటీషన్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కౌనుమోలు, విద్యార్థినులు సత్తా చాటారు. పదవ తరగతి మరియు తొమ్మిద వ తరగతి విద్యార్థినులు సిహెచ్. ఉమాదేవి, జె. బాలచంద్రిక జిల్లా స్థాయిలో మొదటి బహుమతి వీరు రాష్ట్ర స్థాయితో పోటీలకు ఎంపికైనట్లు ఫుడ్ ప్రాసెసింగ్ ట్రైనర్ టి. షాలినీ చెప్పారు. గెలుపొందిన విద్యార్థినిలను పాఠశాల ప్రదానోపాధ్యాయిని శ్రీమతి ఎస్. పద్మజ మరియు పాఠశాల సిబ్బంది వీరిని అభినందించారు.

# ఇంటర్ డిస్ట్రిక్ ఛాంపియన్స్‌గా స్టేడియం క్రీడాకారులు



**గుడివాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ఇటివల జరిగిన 37వ ఇంటర్ డిస్ట్రిక్ ఛాంపియన్‌షిప్ పోటిలలో ఎన్‌టిఆర్ స్టేడియం స్కేటింగ్ క్రీడాకారులు వివిధ విభాగాలలో విజయం సాధించడం అభినందనీయమాని స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్తా కార్యదర్శి కిలారపు రంగప్రసాద్‌లో అన్నారు. శనివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో స్కేటింగ్ పోటిలలో విజయం సాధించిన క్రీడాకారలను అభినందించారు.

# ఆటోలు, బైక్ దొంగతనాల ముఠా అరెస్టు

- కాకినాడ జిల్లా పోలీసులు 60 లక్షల విలువైన వాహనాలు రికవరీ



**కాకినాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా పోలీసులు ఆటోలు, మోటార్‌సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ముఠాను అదుపులోకి తీసుకుని 60 లక్షల విలువైన వాహనాలను రికవరీ చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ శనివారం తన కార్యాలయంలో పత్రికా సమావేశంలో వెల్లడించారు. జిల్లాలోని కాకినాడతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, అనకాపల్లి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చోటుచేసుకున్న 40 వాహన దొంగతనాల కేసుల్లో 48 లక్షల విలువైన 18 ఆటోలు, 12 లక్షల విలువైన 22 మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



**విరవాడ వద్ద అరెస్టు..** పిఠాపురం టౌన్ పోలీసులు క్రైం నెం136/2025 యు/ఎస్ 303(2) బిఎన్ ఎస్ కేసులో నవంబర్ 7న విరవాడ సెంటర్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని, దొంగిలించిన వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపించారు. ఈ కేసులను జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో కాకినాడ డిఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి కృష్ణ, పిఠాపురం సీఐ జి శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు చేదించారు.

**అరెస్టయిన నిందితులు..** 1. పెమ్మాడి ఆశీర్వాదం (36), డ్రైవర్స్ కాలనీ, తూరంగి గ్రామం, కాకినాడ రూరల్. (పాత నేరస్తుడు) పెందుర్తి లోవరాజు (31), తూరంగి గ్రామం, కాకినాడ రూరల్. కొల్లి దుర్గాప్రసాద్ ఏ కిమ్స్ (34), గోలీలపేట, కాకినాడ. కాల కృష్ణ అర్జున్ (42), కరప గ్రామం, కాకినాడ రూరల్. (రిసీవర్) కనుమూరి గణేష్ (44), జగన్నాధపురం కాకినాడ (రిసీవర్) వీరిని అరెస్టు చేశారు.

**ఈ దొంగల విధానం..** నిందితులు రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పార్కు చేసిన ఆటోలు, బైకులను లక్ష్యంగా చేసుకునేవారు. ఆటోలు: హ్యాండిల్ లాక్ వేయని వాటిని త్రాడు సహాయంతో ఇంజిన్ వెనుక భాగం నుండి స్టార్ట్ చేసి తీసుకెళ్లేవారు. మోటార్‌సైకిళ్లు: మారు తాళాలతో తెరిచి దొంగిలించేవారు.ప్రధాన నిందితుడు పెమ్మాడి ఆశీర్వాదం పాత నేరస్తుడు అని ఎస్పీ తెలిపారు. ఇతనిపై గతంలో మూడు ఇంటి దొంగతనాల కేసులు నమోదయ్యాయని తన సహచరులు పెందుర్తి లోవరాజు, కొల్లి దుర్గాప్రసాద్ ఏ కిమ్స్ తదితరులతో కలిసి వాహనాలను దొంగిలించి, ఇంజిన్, చాసిస్ నెంబర్లను మార్చి తక్కువ ధరలకు కాల కృష్ణ అర్జున్, కనుమూరి గణేష్‌లకు విక్రయించేవారని తెలిపారు.

**ప్రజలకు హెచ్చరిక..** వాహనదారులు తమ ఆటోలు,ద్విచక్ర వాహనాలను ఇళ్ల వద్ద లేదా పార్కింగ్ ప్రాంతాల్లో పార్కు చేసే సమయంలో తప్పనిసరిగా హ్యాండిల్ లాక్, చైన్ లాక్ వేయాలని ఎస్పీ బిందుమాధవ్ విజ్ఞప్తి చేశారు.

**పోలీసులను అభినందించిన ఎస్పీ..** ఈ కేసులను చేధించడంలో ముఖ్యపాత్ర వహించిన కాకినాడ డిఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, పిఠాపురం సీఐ జి శ్రీనివాస్, క్రైమ్ ఎస్ఐ బి. వినయ్ ప్రతాప్, టౌన్ ఎస్ఐ వి.మణికుమార్ వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



గన్నవరంలోని ఏబి కన్వెన్షన్ నందు ఇటీవల మరణించిన ముక్కామల సురేంద్ర బాబు పెద్ద కర్మ పాల్గొని అయన చిత్రపటానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించిన గన్నవరం మాజీ శాసనసభ్యులు డా. వల్లభనేని వంశీ
–గన్నవరం,నవంబర్ 8 (వార్తాప్రభ) :

# నేడు కవులూరు లో ఉచిత వైద్య శిబిరం

**జి.కొండూరు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** మండలంలోని కవులూరు గ్రామంలో ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ జువ్వా వెంకటేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో షుగర్, బిపి ఇతర సాధారణ వ్యాధు లకు సంబం ధించి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని జెవిఆర్ వెల్లడిం చారు. వ్యాధి నిర్ధారణ గ్రస్తులకు ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మందులు అందజేయనున్న ట్లు ఆయన తెలియజేశారు.ఈ అవకాశాన్ని కవులూరు, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జువ్వా వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# కుటుంబ కలహాలతో.. భార్యపై హత్యాయత్నం.. భర్త ఆత్మహత్య

- అనాధలుగా మిగిలిన ఇద్దరు పిల్లలు
- ఇంద్రపాలెం/ కోరంగి ఎస్సైలు కేసు దర్యాప్తు

**కాకినాడ క్రైమ్/ తాళ్ళరేవు, నవంబర్ 8 (వార్తాప్రభ) :** దంపతుల మధ్య తలెత్తిన కుటుంబ కలహాల కారణంగా ఏర్పడ్డ వివాదం చివరకు భార్యపై హత్యాయత్నం.. ఆపై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. దీంతో వారిద్దరికీ చెందిన కుమారుడు, కుమార్తె అనాధలుగా మిగిలారు. ఈ హృదయ విధారక ఘటన ఒకపక్క కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం డ్రైవర్స్ కాలనీలో చోటు చేసుకోగా.. మరోపక్క కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పోలీసు సర్కిల్ కోరంగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. భార్య డ్రైవర్స్ కాలనీలో హత్యాయత్నానికి గురికాగా.. భర్త తాళ్లరేవు మండలం పటవల గ్రామ శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు, కోరంగి ఎస్సై పి సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ ఘటనలో భార్య చీపురుపల్లి దేవి తీవ్ర గాయాల పాలై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆమె భర్త చీపురుపల్లి రాజేష్ (38) ఆత్మహత్యకు పాల్పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కోరంగి ఎస్సై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. బార్బర్ వృత్తి చేసుకుంటున్న రాజేష్ భార్యా పిల్లలతో కర్ణాటకలో ఉంటున్నాడు. అయితే ఇటీవల దీపావళి సందర్భంగా.. రాజేష్ స్వగ్రామమైన



కాజులూరు మండలం శీల గ్రామానికి వచ్చారు. రాజేష్ భార్య దేవి కాకినాడ రూరల్ మండలం డ్రైవర్స్ కాలనీకి వాళ్ల పుట్టింటికి వెళ్ళగా శుక్రవారం సాయంత్రం వీరిద్దరి మధ్య కుటుంబ కలహాలు ఎక్కువ అవ్వడంతో న్యాయవాది ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించి అనంతరం చాకుతో భార్య దేవిని భర్త రాజేష్ తీవ్రంగా గాయపరిచి వారి ఇద్దరి పిల్లలను తీసుకుని రాజేష్ స్వగ్రామమైన శీల వెళుతూ.. పటవల గ్రామపంచాయతీ పరిధిలోని మంజేరు రోడ్డు సమీపంలో తనతో పాటు తెచ్చుకున్న పాయిజన్ తీసుకుని, భార్యపై దాడి చేసిన కత్తితో అతను పీక కోసుకుని పిల్లలను అక్కడే వదిలేసి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణకు సమాచారం రాగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. దీనిపై కోరింగ ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామపంచాయతీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ వద్ద హత్యాయత్నానికి గురైన దేవి తీవ్ర గాయాల పాలవడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుంది. దీనిపై ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు కేసు దర్యాప్తు చేపట్టారు.ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగాని ఉందని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు తెలిపారు.

# పథకాల స్ఫూర్తికి అనుగుణంగా అభివృద్ధి అడుగులు..

● స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమం అమలు ● జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలపైనా ప్రత్యేక దృష్టి ● ఆయుష్మాన్ భారత్-డా. ఎన్టీఆర్ వైద్య సేవతో విస్తృత సేవలు ● భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగానూ జల్ జీవన్ మిషన్, అమృత్ ప్రణాళికలు ● 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్

**విజయవాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** పథకాల స్ఫూర్తిని పూర్తిస్థాయిలో అర్థంచేసుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేయడం ప్రధానమని.. ఈ నేపథ్యంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాల వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమం అమలుకావాలని అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి వైద్య ఆరోగ్యం, అమృత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్‌లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జననీ సురక్షా యోజన (జేఎస్‌వై), జననీ శిశు సంరక్ష కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన తదితర పథకాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాలకు సంబంధించిన అంశాలపై సమీక్షించి, పురోగతికి అవసరమైన కార్యాచరణపై సూచనలు చేశారు. బహుళ ప్రయోజనాల పీఎం సూర్యఘర్ పథకం అమల్లోనూ మరింత చొరవ చూపాలన్నారు. సమీక్షా సమావేశం అనంతరం లంకా దినకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని.. జననీ సురక్షా యోజన ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 1,685 మందికి, పట్టణ ప్రాంతాల్లో 924 మందికి లబ్ధి చేకూరిందన్నారు. అదేవిధంగా జననీ శిశు సంరక్ష కార్యక్రమం ద్వారా ఉచిత పౌష్టికాహారం, మందులు, వైద్య పరీక్షలు వంటి సేవలు అందుతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టిసారిస్తోందని.. ఈ క్రమంలో మాతా శిశు మరణాల రేటును తగ్గించడంపై అధికారులకు సూచనలు చేసినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ కార్యక్రమం కింద జిల్లాలో జగ్గయ్యపేట, ఎ.కొండూరు, తిరువూరులో డయాలసిస్ సేవలు అందుతున్నాయని.. మొత్తంమీద 20 కేంద్రాల ద్వారా ఈ సేవలు అందుతున్నాయన్నారు. ఎ.కొండూరు ప్రాంతంలో డయాలసిస్ సేవల విస్తృతికి చర్యలు తీసుకుంటున్నట్లు లంకా దినకర్ వెల్లడించారు.




**సమన్వయ శాఖల సమష్టి కృషి..** చిన్నారులు, గర్భిణీల్లో రక్తహీనత సమస్యలు లేకుండా చూడటంలో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యం, విద్యాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన – డా. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి చూస్తే ఇప్పటివరకు రూ. 58 కోట్ల విలువైన వైద్య సేవలు అందాయన్నారు. 108 వాహనాలు (28) 104 వాహనాలు (21), 102 వాహనాలు (20) ద్వారా సేవలందుతున్నాయని.. 108 వాహనాలకు సంబంధించి రెస్పాన్స్ టైమ్‌ను తగ్గించేందుకు నిరంతర పర్యవేక్షణ, సమన్వయం అవసరమని అధికారులకు సూచించినట్లు తెలిపారు. 104 వాహనాల ద్వారా ప్రతిగ్రామంలోనూ నెలకు రెండుసార్లు స్థానికులకు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సిద్ధార్థ వైద్య కళాశాల అభివృద్ధి కార్యకలాపాలపైనా చర్చ జరిగిందని.. పీఎం స్వాస్థ్య సురక్షా యోజన (పీఎంఎస్ఎస్‌వై) ద్వారా రూ. 150 కోట్లతో సూపర్ స్పెషాలిటీ సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి చేయడం జరుగుతోందని, ఈ పనులు కూడా చివరిదశలో ఉన్నట్లు తెలిపారు. బహుళ అంశాల్లో పరిశోధన విభాగం ద్వారా 17 రకాల ప్రాజెక్టులపై పనిచేస్తున్నట్లు వివరించారు. ఆడిటోరియం అభివృద్ధికి దాదాపు రూ. 9 కోట్లు అవసరమవుతుందని కళాశాల ప్రిన్సిపల్ తెలిపినట్లు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర సాధనకు సురక్షిత తాగునీరు కూడా ఒక కీలక అంశమని.. జల్ జీవన్ మిషన్‌కు సంబంధించి మొత్తం పరిస్థితిని చక్కదిద్దుకుంటూ ముందుకెళ్లడం జరుగుతోందని, రూ. 500 కోట్ల మేర ఉన్న ప్రాజెక్టు వ్యయం నేడు రెండు వేల కోట్లు వరకు అవుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధికారులు సరైన సమాచారం, ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించినట్లు తెలిపారు. వీఎంసీ పరిధిలో అమృత్ 1.0 కింద దాదాపు రూ. 100 కోట్లతో చేపట్టిన పనులు పూర్తికావొస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగానూ తాగునీటి సరఫరా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం అమల్లోనూ వేగం పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. త్వరలో ప్రత్యేకంగా జిల్లాకు సంబంధించి విద్యా శాఖపై సమీక్ష నిర్వహించనున్నట్లు లంకా దినకర్ వెల్లడించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎ.విద్యాసాగర్, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, డా. ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయ అధికారి డా. జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం లో నవంబర్ 9 యాదవ కార్తీక వన సమారాధన



**విజయవాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ని బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 9 న జరిగే కార్తీక వన సమారాధనకు సంబంధించిన ఇన్విటేషన్ ఇచ్చి ఆహ్వానించారు. మంత్రి నీ కలసిన వారిలో యాదవ సేవా సంఘ నాయకులు పల్లపాటి చినబాబు, గోరిపర్తి రాము, ఆరేపు లక్ష్మణ కుమార్, దేవన బోయిన వెంకటకృష్ణారావు, బోయిన గంగరాజు, జొన్నలగడ్డ నాగరాజు తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చిన్నబాబు యాదవ్ మాట్లాడుతూ నవంబర్ 9న జరిగే యాదవ కార్తీక సమారాధన స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరుగుతుందని ఈ కార్యక్రమానికి యాదవ ఆత్మబంధువులందరూ విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొలికపూడి



**విస్సన్నపేట,నవంబర్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రెల గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలకు తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కోశాధికారి జివి రావు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడు పట్టణ అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలి...

–టౌన్ ప్లానింగ్ అధికారి వసీం బేగ్



**విజయవాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** ప్రపంచ టౌన్ ప్లానింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, నవంబర్ 8 వ తేదీ శనివారం ఉదయం విజయవాడ కార్పోరేషన్ పరిధి లోని ఆర్.టి.సి. కాలనీ లో గల మున్సిపల్ ఇండోర్ స్టేడియం, సొసైటీ – ఫన్ టైమ్స్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ డైరెక్టర్ అజయ్ కుమార్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వసీమ్ బేగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫన్ టైమ్స్ కాలనీ ప్రతి నిధులు, కాలనీ పెద్దలు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, టి.పి.ఓ. వసీమ్ బేగ్ మాట్లాడుతూ, పట్టణ ప్రణాళిక యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పట్టణాభివృద్ధి అనేది ప్రభుత్వ ప్రణాళికల తో పాటు ప్రజల సహకారం మీద ఆధారపడి ఉంటుందని, ప్రతి పౌరుడు పట్టణాభివృద్ధిలో భాగస్వామిగా కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు అధికారులతో నేరుగా సంభాషించి, తమ ప్రాంతానికి సంబంధించిన అభివృద్ధి అంశాలు మరియు సమస్యలపై చర్చించారు. అధికారులు కూడా ప్రజల ప్రశ్నలకు సమాధానమిచ్చి, ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధిపై అవగాహన కల్పించారు.

## గోకర్ణేశ్వర స్వామివారిని దర్శించుకున్న యువనేత మండలి వెంకట్రామ్



**కోడూరు, నవంబర్ 8 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డి పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి సమేత శ్రీ గోకర్ణ స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శనివారం నాడు దేవస్థాన ప్రాంగణంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ యువ నేత మండలి వెంకట్రామ్ పాల్గొని గోకర్ణేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదలు అందజేసి చేసి ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు వెంకట్రామ్ కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, లింగా రెడ్డి పాలెం సర్పంచ్ యర్రంశెట్టి శ్రీదుర్గ,పిఎసిఎస్ అధ్యక్షులు కోట సుబ్బారావు, యర్రంశెట్టి దామోదర్ రావు, బచ్చు వెంకటేష్, ముద్దినేని చందర్రావు,బచ్చు పూర్ణచంద్రరావు, శ్రీ గోకనేశ్వర స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ కడవ కొల్లు శ్రీనివాసరావు, భావిశెట్టి వెంకట కోటేశ్వరరావు, కడవకొల్లు రాంబాబు, ఈవో సిహెచ్ సుధాకర్ రావు,ఆలయ సిబ్బంది మాజేటి నాంచారయ్య, దాసరి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## భారత మహిళా క్రికెట్ నల్లపురెడ్డి శ్రీ చరణికి ఘన సత్కారం

● కడప జిల్లాకు చేరుకున్న ఆమెకు ఘన స్వాగతం ● గుర్రపు స్వారీ మీద మేళా తాళాలు అభిమానుల నడుమ భారీ ర్యాలీ ● కడప జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో సన్మాన సభ







(సి.రాజా రెడ్డి)

వైయస్సార్ కడప జిల్లా, నవంబర్ 8: అంతర్జాతీయ స్థాయిలో భారత మహిళా క్రికెట్ తరుపున పాల్గొని ప్రపంచ మహిళ కప్ లో సత్తా చాటిన నల్లపురెడ్డి శ్రీ చరణి ని ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాత్రి శ్రీచరణి కి రాజారెడ్డి క్రికెట్ స్టేడియం నందు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ కడప జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజయానంతరం మొదటిసారిగా కడప చేరుకున్న ఆమెకు ఏసీఏ, జిల్లా క్రికెట్ సంఘం, ప్రజా ప్రతినిధులు,స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యి స్వాగతం పలికారు. స్థానిక పోస్ట్ ఆఫీస్,ఏడురోడ్ల కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి కూడలి, ఎర్రముక్కపల్లె, రాజీవ్ మార్గ్(గాంధీనగర్ పాఠశాల) వరకు గుర్రపు స్వారీ మీద బాణాసంచా, మేళ తాళాలు, అభిమానుల నడుమ భారీ ర్యాలీ జరిగింది. అనంతరం రాజీవ్ మార్గ్ నుండి రాజారెడ్డి స్టేడియం వద్దకు కారులో చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మాట్లాడుతూ.. కడప జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వాసులు ఇంత ప్రేమాభిమానాలు నాపై చూపించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు మహిళల ప్రపంచ వరల్డ్ కప్ లో ప్రతిభ కనిపించినందుకు శ్రీచరణిని అభినందించారు. ఆమె ప్రదర్శనను ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం శ్రీచరణిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆమె పై రూపొందించిన ఏవీ అభిమానులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి,కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి ,కడప నగర మేయర్ ముంతాజ్ బేగం,డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో,కడప క్రికెట్ స్టేడియం శ్రావణ్ రాజ్ రెడ్డి , ఏసీఏ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి,రెడ్డి ప్రసాద్, సంజయ్ కుమార్, ఇతర నాయకులు, క్రికెట్ సంఘం ప్రతినిధులు ,శ్రీ చరణీ కుటుంబ సభ్యులు, పిల్లలు,అభిమానులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి పిఏసిఎస్ ఆర్థిక సహాయం..!



**కోడూరు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని పిట్టలంక గ్రామంలో ఇటీవల కైలా శరత్ కు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలి పోయింది. శనివారం బడేవారి పాలెం పిఏసిఎస్ ఛైర్ పర్సన్ ,మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య , పిఏసిఎస్ డైరెక్టర్ గాదె భాస్కరరావు , సీఈఓ బడే సురేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బడే పిచియ్య , కొక్కు మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## సాయి లక్ష్మి మృతి ఘటనలో అత్తవారి కుటుంబాన్ని కఠినంగా శిక్షించాలి

-ఉమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సత్యసుధామ



**నూజివీడు,నవంబర్ 8 (వార్తాప్రభ) :** హైదరాబాద్ బాలానగర్ లో ఇటీవల సంచలనం కలిగించిన సాయి లక్ష్మి తన కవల పిల్లలను బలవన్మరణానికి గురిచేసి, తాను ఆత్మహత్య చేసుకున్న ఘటనలో అత్తవారి కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని ఉమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సత్య సుధామ, వ్యవస్థాపక చైర్మన్ తోకల రాజేష్ డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని అమర్ భవన్ లో శుక్రవారం రాత్రి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బాలానగర్ కు చెందిన సాయి లక్ష్మిని ఐదేళ్ల క్రితం నూజివీడు కోమల జ్యువెలర్స్ అధినేత చల్లారి సాంబశివరావు రెండవ కుమారుడు అనిల్ తో వివాహం జరిగిందన్నారు. వివాహ సమయం ప్రతం నుండి అత్త శివలక్ష్మి, తోటి కోడలు శిరీష అదనపు లాంచనాల కోసం, స్త్రీ ధనం కోసం వేధింపులు మొదలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో సాయి లక్ష్మి ఇద్దరు కవలలకు జన్మనిచ్చినదని, వారిలో బాబు కార్తికేయకు సరిగా మాటలు రాకపోవడంతో తోటి కోడలు డాక్టర్ శిరీష, బావ రామకృష్ణలు కలసి సాయి లక్ష్మికి, అత్త శివలక్ష్మి సమక్షంలో మూగ బిడ్డను కన్నావు మాటలు సరిగా రావడం లేదని అనుక్షణం వేధించడం జరిగిందని మృతురాలు సాయి లక్ష్మి పుట్టింట అనేకమార్లు అవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. సాయి లక్ష్మికి తరచూ ఫోన్ చేస్తూ మామ సాంబశివరావు లావుగా ఉన్నావని, పిల్లలను పెంచడం చేతకాదని నిత్యం వేధిస్తూ మానసిక వేదనకు గురిచేసినట్లు తమ వద్ద ఫిర్యాదు ఉందన్నారు. ఈ క్రమంలోనే గత నెల 11వ తేదీన సాయి లక్ష్మి తోటి కోడలు పుట్టినరోజు కావడంతో వెళ్లిన నేపథ్యంలో కొబ్బరికాయ కుళ్ళిపోవడంతో మానసికంగా దాడి చేసినట్లు మృతురాలు ఆవేదన చెందిందన్నారు. చెప్పలేని మనోవేదనతో సెల్ఫీ వీడియో తీసి తన ఇద్దరు కవల పిల్లలకు విషమిచ్చి, సాయి లక్ష్మి భవనం పై నుండి దూకి మరణించినట్లు తెలిపారు. ఎంబీఏ లో కాలేజ్ టాపర్ అయిన సాయి లక్ష్మి ఏమాత్రం పిరికిది కాదని, అత్తవారి ఇంట మానసిక వేదనలు భరిస్తూ, పుట్టింటి పరువు పోకుండా సహించినట్లు చెప్పారు. సాయి లక్ష్మి, ఆమె పిల్లల మృతి ఘటనలో మృతురాలి మామ, అత్త, బావ, తోటి కోడలు కేసు నుండి తప్పించుకున్నారని తెలిపారు. నిత్యం సాయి లక్ష్మీ తల్లిదండ్రులకు బెదిరింపు లేఖలు, వాయిస్ మెసేజ్ లు పంపిస్తూ మిగిలిన కుటుంబ సభ్యులను కూడా బెదిరిస్తున్నారని వివరించారు. అదనపు కట్నం కోసం తెగించిన ఇలాంటి రాక్షస కుటుంబానికి కఠిన శిక్షలు అమలు కావాలని, ఏ మహిళ ఇలాంటి దుర్భర స్థితి అనుభవించకూడదని కోరారు. ఈ మేరకు నూజివీడు డిఎస్పీ, పట్టణ సీఐ లకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తామన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ దృష్టికి కూడా ఈ సంఘటన తీసుకువెళతామని స్పష్టం చేశారు.

## ఫిట్ ఇండియా సైక్లోథాన్‌లో కలెక్టర్

● ఐదు కిలోమీటర్ల సైకిల్ సవారీతో యువతకు స్ఫూర్తి దాయకంగా నిలిచిన చదలవాడ నాగరాణి
● అధికారులు, పోలీసులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఆరోగ్య కార్యక్రమం



**భీమవరం,నవంబర్ 8 (వార్తాప్రభ) :** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా భీమవరం విష్ణు కాలేజీలో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి "ఫిట్ ఇండియా %-% సైక్లోథాన్" సైకిల్ ర్యాలీకి ఫ్లాగ్‌ఆఫ్ చేసి ప్రారంభించారు. ఈ ర్యాలీ విష్ణు కాలేజీ నుంచి జువ్వలపాలెం అల్లూరి సీతారామ రాజు విగ్రహం వరకు ఐదు కిలోమీటర్ల దూరం సాగింది. కేవలం జండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాక, ర్యాలీ కి ముందు ఉండి మార్గనిర్దేశకత్వం వహించటం ద్వారా కలెక్టర్ నాగరాణి ప్రత్యేకతను ఆపాదించుకున్నారు. పూర్తి నిడివి 5 కిలోమీటర్లు సైకిల్ తొక్కి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఇతర అధికారులు కూడా సైక్లింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వం కోసం ప్రతిరోజూ కొంత సమయం నడక, సైక్లింగ్ , యోగాకు కేటాయించాలన్నారు. "ఆరోగ్యమే మహాభాగ్య మన్న నాగరాణి దినచర్యలో వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బందికి ఒత్తిడి తగ్గించేందుకు ప్రతి నెల ఒకసారి వాక్, 2కే రన్, యోగా, సైక్లింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. పోలీస్ శాఖ ప్రతి నెలా ఇలాంటి ఫిట్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయం అని ప్రశంసించారు. ఇవి మనసు, శరీరానికి ఉల్లాసం ఇస్తాయి. ఆరోగ్య జీవనశైలికి ప్రేరణ కలిగిస్తాయని చెప్పారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ, కలెక్టర్ మార్గదర్శకత్వంలో ప్రతి నెలా ఒక ఫిట్‌నెస్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇలాంటి చర్యలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ బి. శివనారాయణరెడ్డి, ఆర్డీవో కె. ప్రవీణ్‌కుమారరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్రరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఏ. రాంబాబు, డీఈఓ ఇ. నారాయణ, డీపీఓ ఎం. రామనాథరెడ్డి, భీమవరం, నరసాపురం డీఎస్పీలు, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, తహసీల్దార్ రవి రాంబాబు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## సూర్యారావుకు చిరుసత్కారం..

**కాకినాడ,నవంబర్ 8 (వార్తాప్రభ) :** చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ 8వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా కళాకారులు డా.తురగా సూర్యారావుకు చిరుసత్కారం లభించింది. చేయూత సంస్థ వార్షికోత్సవం వేడుకలు స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్ లో డాక్టర్ రవి కుమార్ మరియు వారి టీమ్ ఆధ్వర్యములో జరిగినవి. స్వచ్ఛంద సేవ చేస్తున్న సూర్యారావును ఆహూతులు,ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీలు పేరా బత్తుల రాజశేఖర్,కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు, ఎంపీ ఉదయ శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188